ong-5_ong-5.qxd 2/18/2026 12:09 AM Page 1



## మొదటి బ్యాచ్‌లోనే జేఈఈ మెయిన్స్‌లో ఎస్.ఎస్.ఎన్ ప్రభంజనం

**ఒంగోలు, ప్రభాతవార్త**




సోమవారం సాయంత్రం విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ 2026 మొదటి షిఫ్ట్ ఫలితాలలో ఎస్. ఎస్. ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. స్థానిక మంగమూరు రోడ్డు లోని ఎస్.ఎస్.ఎన్ జూనియర్ కళాశాలలో జె ఈ ఈ మెయిన్స్ మొదలు పెట్టిన మొదటి బ్యాచ్ ఫస్ట్ అటెంప్ట్ లో బి స్రవంత్ అశోక్ ఓపెన్ క్యాటగిరి లో 97.28 పర్సంటైల్ సాధించి ప్రకాశం జిల్లాకు గర్వకారణంగా నిలిచారని ఎస్. ఎస్. ఎన్ విద్యాసంస్థల చైర్మన్ ఎల్లటూరి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. అలాగే మరో ఐదుగురు విద్యార్థులు 90 పర్సంటైల్ సాధించినట్లు పేర్కొన్నారు. రాసిన 40 మందిలో 17 మంది జేఈఈ అడ్వాన్స్ కి అర్హత సాదించారు. రానున్న కాలంలో అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక దృష్టి సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం నుండి జేఈఈ మెయిన్స్ పరీక్షల నిమిత్తం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ వై శివానందరెడ్డి, డీన్ జనార్ధన్ రెడ్డి, ఉపాధ్యాయులు రఘునాథ్ రెడ్డి, మధు, చెంచిరెడ్డి మరియు రాజేష్ తదితరులు అభినందించారు.

## రైల్వే అండర్ పాస్ స్థానంలో ఫ్లైఓవర్ నిర్మించండి

**ఉలవపాడు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**



చాకిచెర్ల రైల్వే గేట్ నవబర్ 175 స్థానంలో రైల్వే అండర్ పాస్ నిర్మించేందుకు రైల్వే అధికారులు సిద్ధమయ్యారు. దీనిని వ్యతిరేకిస్తూ చాకిచెర్ల, పెద్ద పట్టపు పాలెం, చాగొల్లు, రామాయపట్నం పంచాయతీల ప్రజలు పనులను అడ్డుకున్నారు. దీనిపై ప్రజల అభిప్రాయ సేకరణ కొరకు చాకిచెర్ల సచివాలయం ప్రాంగణంలో తాసిల్దార్ శ్రీనివాసులు అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ప్రజల తరపున కొందరు ప్రతినిధులు మాట్లాడుతూ గతంలో నిర్మించిన రైల్వే అండర్ పాసులు అస్తవ్యస్తంగా ఉన్నాయని వర్షాల సమయంలో రాకపోకలకు పూర్తిగా ఇబ్బంది కలుగుతుందని, అండర్ పాస్ స్థానంలో ఫ్లై ఓవర్ నిర్మించాలని కోరారు. ప్రజల అభిప్రాయాలను సేకరించిన రైల్వే అధికారులు ప్రస్తుతానికి అండర్ పాస్ పనులు నిలుపుదల చేస్తున్నామని, మీరు తెలిపిన అభిప్రాయాలను పై అధికారులకు తెలియజేసి తదుపరి చర్యలు చేపడతామన్నారు. మీకు తెలియకుండా అక్కడ ఎటువంటి పనులు చేపట్టబోమని రైల్వే అధికారులు ప్రకటించటంతో ప్రజలు శాంతించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సిఐ అన్వర్ భాష, ఉలవపాడు ఎస్ఐ సుబ్బారావు, రైల్వే ఎస్పై ఎన్ సుబ్బారావు, రైల్వే ప్రతినిధులు నాలుగు పంచాయతీల ప్రజలు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో నేషనల్ డి వార్మింగ్ డే

**ఉలవపాడు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**




స్థానిక జీవీఎస్ఎమ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో "నేషనల్ డి వార్మింగ్ డే నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నులిపురుగులు చిన్న సమస్య కాదు అలాగని పెద్ద సమస్య కాదు చిన్న పిల్లలను వేధించే చికాకు సమస్యన్నారు. ఆరోగ్యంగా పిల్లలు ఎదగాలంటే ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థ ఉండాలి మనదేశంలో 65 మంది నులిపురుగులతో బాధపడుతున్నారని, ఆరోగ్యంవంతమైన పిల్లల భవిష్యత్తు కోసం నులిపురుగులను నివారించాలన్నారు. ప్రిన్సిపాల్ ఎల్. సుధారాణి హెల్త్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ డి సుజాత నులి పురుగు మాత్రలైన ఆల్బెండజోల్ విద్యార్థులకు మింగించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గవర్నమెంట్ ఆరోగ్య శాఖ ప్రాథమిక కేంద్రం కరేడు వారు పిల్లలకు ఎలా తమ చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ మరియు ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి నులిపురుగుల మందులు వాడాలి

**కొత్తపట్నం. ఫిబ్రవరి 17 ప్రభాతవార్త**



కొత్తపట్నం మండలం ఈతముక్కల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డాక్టర్ నవ్యారెడ్డి, సాయి శ్రీనాద్ జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈత ముక్కల ప్రభుత్వ మహిళ పాలిటెక్నిక్ కళాశాల, ఎయిడెడ్ స్కూల్‌లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ .నవ్యారెడ్డి విద్యార్థుని, విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి ఆరు నెలకు ఒకసారి ఈ కార్యక్రమం అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వం స్కూల్స్ మరియు కాలేజ్స్ లో అందరూ కచ్చితంగా ఈ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకొవాలి. ఈ నులి పురుగులు మన శరీరంలో పెరగడం వలన మనం తీసుకునే ఆహారం పూర్తిగా ఈ నులిపురుగులు తీసుకుంటాయి. మల విసర్జన చేసిన ప్రతి సారి, చేతులు శుభ్రంగా కడుకొవాలి. పరిసరాల పరిశుభ్రంగా వుంచుకొవాలి, కూరగాయలు, మరియు పండ్లను తీసుకోనే ముందు నీటి తో శుభ్రంగా కడగాలి, ఇటువంటి జాగ్రత్తలు కచ్చితంగా పాటించిప్పుడు ఎటువంటి వ్యాధులు మన దరి చేరావు అని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈత ముక్కల ప్రాథమిక ఆర్యోగ కేంద్రం సూపర్వైజర్లు, ఆషావర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

## విశిష్ట గుర్తింపు సంఖ్యను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**- వ్యవసాయ అధికారి డి. సుబ్బారెడ్డి**

**జె. పంగులూరు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**




రైతులు వ్యవసాయానికి ఉపయోగాని కావలసిన పరికరాలను చరవాణిలోనే బుక్ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం విశిష్ట గుర్తింపు సంఖ్య పేరిట ప్రవేశపెట్టిందని వ్యవసాయ అధికారి డి.సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని చిన్నమల్లవరం గ్రామం రైతు భరోసా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధి. కారి డి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ డ్రోన్తో మందుల పిచికారీ కోసం, ట్రాక్టర్లు, వరి, కందికోత మిషన్ల ను చరవాణిలో బుక్ చేసుకుంటే నేరుగా పొలం వద్దకు వస్తారని రైతులు ఈ సదవకాశంన్ని సద్వి నియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు వినయ్‌కుమార్, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## మేర యువ భారత్ యువ ( ఎన్ వై కే ) వాలంటీర్లు నోటిఫికేషన్ విడుదల

**ఒంగోలు కలెక్టరేట్ ప్రభాతవార్త**



ప్రకాశం జిల్లాలో మై భారత్ యువ వాలంటీర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన అధికారి ఆకుల మహేంద్ర రెడ్డి తెలిపారు. ఆసక్తి కలిగిన మరియు అర్హత కలిగిన యువత ఈ అవకాశాన్ని వినియోగించుకొని వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ నియామకానికి అభ్యర్థులు కనీసం 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. 01 ఏప్రిల్ 2025 నాటికి వయస్సు కనీసం 18 సంవత్సరాలు మరియు గరిష్టంగా 29 సంవత్సరాలు ఉండాలని ప్రకాశం జిల్లా వాసులై ఉండాలి తెలిపారు. ప్రస్తుతం రెగ్యులర్ విద్యార్థులుగా చదువు తున్న వారు ఈ పథకానికి అర్హులు కారని స్పష్టం చేశారు. ఎంపిక ప్రక్రియలో ఉన్నత విద్యార్హతలు కలిగి కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని, అలాగే మై భారత్ అనుబంధ యువజన సంఘాల సభ్యులకు ప్రాధాన్యత కల్పించబడుతుందని తెలిపారు. ఎంపికైన యువ వాలంటీర్లకు నెలకు రూ.5,000/ (అన్ని కలిపి) గౌరవ వేతనం అందించబడుతుందని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 20వ తేదీ చివరి తేదీగా నిర్ణయించబడినందున ఆసక్తి కలిగిన యువత గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన అధికారి ఆకుల మహేంద్ర రెడ్డి కోరారు. మరిన్ని వివరాల కొరకు 9963533440 సంప్రదించాలని కోరారు.

## ప్లాట్లు, గృహాల క్రమబద్ధీకరణ చేయించుకోవాలి

**చీమకుర్తి, ఫిబ్రవరి 17,ప్రభాతవార్త**



అనధికారకంగా నిర్మించుకున్న గృహాలు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని గుంటూరు రీజనల్ టౌన్ ప్లానింగ్ బృందం సభ్యులు కోరారు. చీమకుర్తిలో క్షేత్రస్థాయి లో పరిశీలనకు ఈ సభ్యులు మంగళవారం హాజరయ్యారు. ఆర్డిడిటిపి పి మధు కుమార్ ఆధ్వర్యంలో టీపిపి పవన్ కుమార్, ఏడియం పెంచలయ్యలు రాగా, మున్సిపల్ కమిషనర్ వై రామకృష్ణ వారితో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. చీమకుర్తిలో మొత్తం 56 అనధికార లేఔట్లను గుర్తించి, అందులో 50 లేఔట్లకు ఐపీఎల్పి పాటర్న్ రూపొందించామని కమిషనర్ తెలిపారు. ఎల్ఆర్ఎస్ కోసం 110 దరఖాస్తులు రాగా అందులో 35 దరఖాస్తులను క్రమబద్ధీకరించామని, బిపిఎస్ స్కీములో 111 దరఖాస్తులు రాగా, 35 భవనాలకు క్రమబద్ధీకరించి అనుమతులు ఇచ్చామని కమిషనర్ తెలిపారు. డిపిఓ శారద కూడా ఈ సందర్భంగా ఏర్పాటు అయిన సమావేశానికి వారి సిబ్బందితో హాజరయ్యారు. మార్చి 22 లోపుగా బిపిఎస్ పథకం కోసం, ఏప్రియల్ 22 లోపుగా ఎల్ఆర్ఎస్ పథకం కోసం దరఖాస్తులు చేసుకొని రెగ్యులరైజ్ చేయించుకోవాలని ఈ సందర్భంగా అధికారులు ప్రజలను కోరారు.

ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

## జేఈఈ ర్యాంకులు సాధించిన పూర్వ విద్యార్థులకు అభినందన

**కొండపి, ప్రభాతవార్త**






ఐఐటి ఎన్ఐటి ప్రవేశాలకు ఉద్దేశించి జరిగిన జేఈఈ మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో తమ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులైన మా రెడ్డి తేజేశ్వర రెడ్డి అన్నవరపు హర్షవర్ధ ర్యాంకులు సాధించడంపై కొండేపిలోని శాంతినికేతన్ హైస్కూల్ డైరెక్టర్ మలసాని హరినాథ్ విద్యార్థులను అభినందించారు.



డైరెక్టర్ మాట్లాడుతూ తేజేశ్వర్ రెడ్డి హర్షవర్ధన్లు తమ పాఠశాలలో మొదటి తరగతి నుండి పదవ తరగతి వరకు ఐఐటి కాన్సెప్ట్‌తో నిర్వహిస్తున్న తమ పాఠశాల అయిన శాంతినికేతన్‌లో చదివి 2023 24 సంవత్సరంలో పదవ తరగతిలో అత్యున్నత మార్కులు సాధించారని ఆయన పేర్కొన్నారు. పూర్వం విద్యార్థులు ర్యాంకులు సాధించడం పట్ల ఆయనతో పాటు విద్యానందించిన ఉపాధ్యాయులు వారికి అభినందనలు తెలియజేశారు.

# గృహ నిర్మాణాలు ఉగాది నాటికి లక్ష్యం చేరాలి: కలెక్టర్

**ఒంగోలు, ప్రభాతవార్త**





ఉగాది నాటికి నిర్దేశించిన లక్ష్యం మేరకు గృహ నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు స్పష్టం చేశారు. మంగళవారం ఆయన ప్రకాశం భవనం నుంచి మున్సిపల్ కమీషనర్లు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హౌసింగ్, సచివాలయాల సేవలు, యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, పారిశుధ్యం, స్వమిత్వ సర్వే, ఇంటి పన్నుల వసూళ్లు, అక్షర ఆంధ్ర విద్యా, వైద్యం, డ్వామా, పంచాయతీ ఆజ్ పనులపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జన్మన్, పీఎంఏవై 2.0 పథకం కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణాలలో కూడా వేగం పెంచాలని స్పష్టం చేశారు. సచివాలయాల సిబ్బందితో చేయిస్తున్న సర్వేలను కూడా ఈ నెలాఖరు నాటికి ముగించాలన్నారు. ఇంటి పన్నుల వసూళ్లలో లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. పదవ తరగతి విద్యార్థులకు హెల్త్ చెకప్ చేయాలని, వారిని పబ్లిక్ పరీక్షలకు పూర్తి స్థాయిలో సన్నద్ధం చేసేలా ఎంఈఓలు తమ పరిధిలోని పాఠశాలలను రెగ్యులర్‌గా సందర్శించాలన్నారు. అక్షర ఆంధ్ర కార్యక్రమంపైనా ప్రత్యేక శ్రద్ద పెట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించిన నిదులను సమర్థంగా వినియోగించుకునేలా పెండింగ్ పనులను పూర్తి చేయాలని పంచాయతీ రాజ్, డ్వామా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, జడ్పీ సీఈఓ చిరంజీవి, డీపీఓ వెంకటేశ్వరరావు, డీఈఓ రేణుక, ఆర్ఐఓ ఆంజనేయులు, డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ జోసఫ్ కుమార్, పంచాయతీ రాజ్ ఎస్ఈ అశోక్, డీఆర్‌డీఏ పీడీ నారాయణ, సీపీఓ సుధాకర్‌రెడ్డి, సచివాలయాల నోడల్ ఆఫీసర్ సువార్తమ్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆరో తరగతి విద్యార్థి సయ్యద్ కౌశిత్ మరణంపై పూర్తిస్థాయి దర్యాప్తు చేయించాలి

**- విద్యార్థి మృతికి కారకులైన స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి**

**- ఉమ్మడి ప్రకాశం జిల్లా డీసీసీ అధ్యక్షులు షేక్ సైదా**

**ఒంగోలు, ప్రభాతవార్త**

సింగరాయకొండ శ్రీ చైతన్య స్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్న కనిగిరి పట్టణానికి చెందిన కార్ డ్రైవర్ సయ్యద్ అలీ కుమారుడు కౌశిత్ స్కూల్ యాజమాన్య దుశ్చెర్యాల వల్ల విద్యార్థి మృతి చెందడం బాధాకరమని ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ సైదా అన్నారు. బ్రిలియంట్ స్టూడెంట్ అయినా కౌశిత్ ఆత్మహత్య చేసుకున్నాడని స్కూల్ యాజమాన్యం బుకాయించడం సమంజసం కాదు, 11 సంవత్సరాల విద్యార్థి ఏ విదంగా ఆత్మహత్య చేసుకుంటాడో స్కూల్ యాజమాన్యం చెప్పాలని ఆయన అన్నారు. స్కూల్ కరస్పాండెంట్ రమణారెడ్డి, అలాగే హాస్టల్ వార్డెన్ దీనికి బాధ్యత వహించాలని ఆయన అన్నారు. గతంలో రెండు పర్యాయాలు హాస్టల్ వార్డెన్ సయ్యద్ కౌశిత్‌ను కొట్టివేదించాడని అలాగే మొన్న తండ్రితో మాట్లాడిన గంట వ్యవధి తర్వాత చనిపోయాడని కాలేజీ యాజమాన్యం తన తండ్రికి ఫోన్ చేసి చెప్పడం అనుమానాలకు తావిస్తుందని ఆయన అన్నారు. ఈ స్కూల్ మీద అనేక ఆరోపణలు ఉన్నాయని గతంలో అన్నగా 2008వ సంవత్సరంలో సింగరాయకొండ గ్రామానికి చెందిన ఎనిమిదో తరగతి చదువుతున్న ఎన్నాబత్తిన శిరీష అనే అమ్మాయిని ఫీజు కట్టలేదని పదే పదే అందరి ముందు అవమానించినందుకు మనస్థాపం చెంది ఆ అమ్మాయి ఇంటికెళ్లి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఆయన అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉండి స్కూల్ ఏర్పాటు చేసి జలగల్లాగా రక్తం పిండి పేద తల్లిదండ్రుల నుండి కోట్లాది రూపాయలు ఫీజుల రూపంలో వసూళ్లు చేసి కోట్లకు పడగలెత్తిన వాకా రమణారెడ్డిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆ స్కూల్‌కి ప్రభుత్వ పరిమితి ఉండి ఉంటే వెంటనే రద్దు చేసి స్కూల్‌ని మూసివేయాలని సైదా డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ బాధిత సయ్యద్ అలీ కుటుంబానికి అండగా ఉంటుందని, ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్ది విభాగం ఎన్ఎస్‌యుఐ ఉపాధ్యక్షుడు చందు నాయక్ సారధ్యంలో నిన్న కలెక్టరేట్ విద్యార్థులు పెద్ద ఎత్తున ధర్నాలో పాల్గొన్నారని ఆయన అన్నారు.

## చిన్నారుల సమగ్ర ఎదుగుదలే లక్ష్యంగా పనిచేయాలి

**- జిల్లా కలెక్టర్ రాజాబాబు**

**ఒంగోలు, ప్రభాతవార్త**



అంగన్‌వాడీలలోని చిన్నారుల సమగ్ర ఎదుగుదలే లక్ష్యంగా సిబ్బంది పని చేయాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు స్పష్టం చేశారు. ఈ దిశగా దృష్టి సారించాలని సీడీపీవోలకు ఆయన దిశానిర్దేశం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు, సిబ్బంది పనితీరుపై మంగళవారం ప్రకాశం భవనంలో ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. వయసుకు తగినట్టుగా పిల్లల బరువు, ఎదుగుదల ఉండాలన్నారు. పోషకాహార లోపం, ఎత్తు తక్కువ, బరువు తక్కువ ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని చెప్పారు. ఇలాంటి పిల్లలు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు సూపర్‌వైజర్లు లేని నప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలపైనా సీడీపీవోలు మరింత దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. నెల రోజుల్లో స్పష్టమైన మార్పు కనిపించాలన్నారు. తీవ్రమైన పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులకు మంచిఆహారాన్ని ఎన్ఆర్‌సీలో కాకుండా స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలు, లేదా చిన్నారుల ఇంటి వద్ద అందించేందుకు ప్రభుత్వ పరంగా ఉన్న అవకాశాలను పరిశీలించాలని ఆయన చెప్పారు. ఈ విధంగా బాధపడుతున్న చిన్నారులకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి ద్వారా సహాయం లభించేలా తాను కూడా చర్యలు తీసుకుంటానన్నారు. సీడీపీవోలు నిత్యం క్షేత్ర స్థాయిలో పర్యటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. విదుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అంగన్‌వాడీ సిబ్బందిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ బి.చిన ఓబులేసు, ఐసీడీఎస్ పీడీ మాధురి పాల్గొన్నారు.

## మంత్రి నారాయణని కలిసిన జేసి, మేయర్

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



సిఆర్‌డిఏ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి నారాయణని కలిసి ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పన కుమారి, ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, ఒంగోలు మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతిపాదనలు అందజేశారు.

## విచారణ ఖైదీకి న్యాయ సహాయం చేసి న్యాయవాది నియమిస్తాం

**ఒంగోలు, ప్రభాతవార్త**



అర్హత కలిగిన విచారణ ఖైదీకి, శిక్ష పడిన ముద్దాయికి సైతం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థలు, మండల న్యాయ సేవాధికారి కమిటీలు ఉచితంగా న్యాయ సహాయం చేసి న్యాయవాది నియమిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. మంగళవారం ఒంగోలు పట్టణంలోని జిల్లా జైలును న్యాయమూర్తి తనిఖీ చేసి అక్కడ ఖైదీలకు అందుతున్న భోజన సదుపాయాలను, వసతి సదుపాయాలను పరిశీలించారు అదేవిధంగా అక్కడ ఖైదీలకు నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి మాట్లాడుతూ క్షణికావేశంలో తప్పులు చేయటం వలన తమ యొక్క అమూల్యమైన జీవితాలను వ్యర్థం చేసుకోవద్దని తద్వారా కుటుంబాలకు దూరం అవ్వటం వల్ల మానసికంగా ఎంతో వేదన అనుభవించల్సి వస్తుందని న్యాయమూర్తి అన్నారు. అదే విధంగా రాజీ పడదగిన క్రిమినల్ కేసులు ఏమైనా ఉంటే మార్చి 14వ తేదీ జరగబోయే జాతీయ లోక్ అదాలత్ నందు ఇరు వర్గాల ఆమోదంతో వ్యాజ్యాలు పరిష్కరించుకోవచ్చని న్యాయమూర్తి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జైలర్ ఎంఎ నాయుడు చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జి. రవిశంకర్ పి. వీర రాఘవులు జైలు విసిటింగ్ అడ్వకేట్ మొబీనా జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సిపిఐ నేత, సీనియర్ న్యాయవాది ముదివర్తికి ఘన నివాళి

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



సిపిఐ సీనియర్ నేత, సీనియర్ న్యాయవాది, ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ ముదివర్తి రాఘవరావు మృతికి పలువురు ఘన నివాళులు అర్పించారు. ఒంగోలు నగరంలోని పలువురు వామపక్ష పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, న్యాయవాదులు ముదివర్తి పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించి, ముదివర్తి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సిపిఐ రాష్ట్ర నాయకులు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న), ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ మానం ఆంజనేయులు ముదివర్తి రాఘవరావు పార్థివ దేహానికి పూలమాలలు వేసి, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే సిపిఐ సీనియర్ నాయకులు కమ్యూ నిజం పత్రిక మాజీ సంపాదకులు ఎం సి వెంకటేశ్వర్లు, ఆసరా కేంద్రం అధ్యక్షులు చిడిపోతు వెంకటేశ్వర్లు, పిడిపిఎఫ్ బ్యాంక్ చైర్మన్ పోతినేని వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి ప్రకాష్‌రావు, మాజీ నగర కార్యదర్శి ఎస్డి సర్దార్, నగర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసులు, కారుమూడి నాగేశ్వరరావు, ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కందుకూరి సుభాన్ నాయుడు, టెలిఫోన్ డిపార్ట్మెంట్ యూనియన్ నాయకులు కే అంజయ్య, షేక్ రావూఫ్, రామలింగం, అన్నెం కొండల నాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్కె మాబు, జీవి కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, సిపిఐ ఎంఎల్ నాయకులు డివిఎన్ స్వామి, ఎస్ లలిత కుమారి, ఎమ్మెస్ సాయి, ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్య దర్శులు వడ్డే హనుమా రెడ్డి, కే వీరారెడ్డి ది విశాఖపట్నం కోపరేటివ్ బ్యాంకు డైరెక్టర్లు నన్నపనేని అంజయ్య, కోటేశ్వరరావు, జోనల్ మేనేజర్ బంగారుబాబు, రాజమండ్రి బ్రాంచ్ మేనేజర్ మూర్తి తదితరులు ముదివర్తి పార్థివ దేహం వద్ద నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అసోసి యేషన్ అధ్యక్షులు బొడ్డు భాస్కర్, కే అరుణ, సిహెచ్ నాగేంద్రం, ముదివర్తి రాఘవరావు జూని యర్లు పెళ్లూరి వసుంధర, మోటుపల్లి రేణుక దేవి,కరవది రాఘవరావు సానుభూతిని తెలియజేశారు.

## పేకాట ప్రాంతంపై దాడి రు. 65వేలు నగదు స్వాధీనం

**సంతనూతలపాడు,(మద్దిపాడు), ప్రభాతవార్త**



మద్దిపాడు మండలం దొడ్డవరం గ్రామ పరిధిలోని పొలాల్లో మంగళవారం నాడు పేకాట ఆడుతున్న ప్రాంతంపై దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 65 వేల రూపాయలను స్వాధీన పరుచుకున్నట్టు సబ్ ఇన్స్పెక్టర్ జి. వెంకట సూర్య తెలిపారు. అదేవిధంగా ఐదు మోటర్ సైకిల్ లను స్వాధీన పరుచుకున్నట్టు ఆయన పేర్కొన్నారు. తదుపరి వారిని కోర్టులో హాజరు పరిచినట్టు ఆయన తెలిపారు.

## ప్రభుత్వ స్థలాల ఆక్రమణకు

# పాల్పడుతున్న భూ కబ్జాదారులు



**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**

ఒంగోలు నగర నడిబొడ్డున రూ.కోట్లు విలువ చేసే స్థలం. ఏ ప్రభుత్వశాఖ అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో ఆక్రమణదారులు గద్దల్లా వాలిపోయారు. రాత్రికి రాత్రి అక్కడ ఉన్న కంప చెట్లు తొలగించి చదును చేసే ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇప్పటి వరకు జరిగిన ఆక్రమణల మాదిరి చోద్యం చూస్తారా. ఖరీదైన స్థలమైనందున అడ్డుకుంటారా. అనేది ప్రశ్నార్థకంగా మారింది. సీఆర్పీ ఉద్యోగులకు ఏళ్ల కిందట నివాస సముదాయంనిర్మించారు. అవి శిథిలావస్థకు చేరడంతో ఇక్కడెవరూ నివాసం లేక ఖాళీగా ఉంటున్నాయి. దీంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. ఇప్పుడు వీటి వెనుక కొండను కబ్జా చేస్తున్నారు. ఇప్పటికే కొండను ఆక్రమించి భారీ భవంతులు నిర్మించారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కొంతమంది ఉద్యోగుల బంధువులు ఉన్నారు. కొండను చదును చేసి తొలుత రేకుల షెడ్లు వేస్తున్నారు. అనంతరం కాంక్రీటు నిర్మాణాలు చేపడుతున్నారు. వీటికి కుళాయి కనెక్షన్, విద్యుత్తు సర్వీసులు సైతం పొందుతున్నారు. కొంతమంది దొంగ పట్టాలు పుట్టించి బాహాటంగా అమ్మేస్తున్నారు. ఏళ్లుగా అధికార యంత్రాంగం కళ్లు మూసుకుని చోద్యం చూస్తుండడంతో ఆక్రమణలకు అంతే లేకుండా పోయింది. రాత్రికి రాత్రి చెట్లు కొట్టేసి..సీఆర్పీ నివాస సముదాయం సమీపంలో పార్కు పక్కన రోడ్డును ఆనుకుని ఉన్న ఏ12, ఏ13, బీ13, బీ14 గృహాల వెనుక రూ.కోట్ల విలువైన స్థలంపై కన్నేశారు. అక్కడంతా చిట్టడవిలా ఉన్న దాంట్లో తొలుత పిచ్చిమొక్కలు తొలగించి అడుగు పెట్టారు. కొద్ది రోజులుగా ఒక్కొక్కటిగా తొలగిస్తూ రెండు రోజుల కిందట చీకటి మాటున భారీ చెట్లను రంపాల సాయంతో కోసేసి తొలగించారు. కంపచెట్లను పూర్తిగా తొలగిపోవడంతో అక్కడ మట్టి తొలగించేందుకు సన్నద్ధమవుతున్నారు. చదును చేయడం పూర్తయితే దాదాపు ఎకరన్నర స్థలం అక్రమార్కుల పరమవుతుంది. మేల్కొనకుంటే మాయం. నివాస సముదాయం వినియోగంలో లేకపోవడంతో తలుపులు, కిటీకీలు, విలువైన ఫర్నీచర్ ఇప్పటికే దొంగల పాలైంది. వీటిని ఆనుకుని ఉన్న స్థలాన్ని ఆక్రమించి ఇళ్ల నిర్మాణం చేపడు తున్నారు. కొద్ది రోజులకు నివాస సముదాయం సైతం కూల్చేసి నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇక్కడున్న ఓ కళాశాల వైపు రహదారిలో దశాబ్దాల కిందటే స్థలాలు అన్యాక్రాంతం కావడంతో వాటికి దొంగ పత్రాలు పుట్టించి అమ్మకాలు చేపట్టారు. అటువైపు కొండ అంచుభాగం మొత్తం భారీ భవంతులు నిర్మించారు. ఇప్పుడు అధికారులు నివాసం ఉండే కీలకమైన ప్రాంతంలో స్థలాన్ని కబ్జా చేసి ప్లాట్లుగా చేసి అమ్మేసేందుకు పథకం వేశారు. అధికారులు గట్టి చర్యలు తీసుకుంటారా. లేక ఆమ్యామ్యాలతో చూసీచూడనట్లు వదిలేస్తారా. అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ విషయ రహదారులు, భవనాలశాఖ ఈఈ గోపీనాయక్ మాట్లాడుతూ తక్షణం సిబ్బందిని పంపించి స్థలాన్ని ఎవరు కబ్జా చేయకుండా అడ్డుకుంటామన్నారు. ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

6_6.qxd 2/18/2026 12:28 AM Page 1



## తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీఆర్వోలు ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయం ముందు నిరసన



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**
తమ తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంతనూతలపాడు రెవెన్యూ కార్యాలయం నందు మండలవీఆర్వోల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం వీఆర్వోలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి వీఆర్వోల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏసీ ఆదిరెడ్డి అధ్యక్షత వహించారు. వీఆర్వోలు ఐక్యత వర్ధిల్లాలని, వీఆర్వోలకు పని భారాన్ని తగ్గించాలని జిల్లా వీఆర్వోల సంఘం ప్రధాన కార్యదర్శి ఆదిరెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త వీఆర్వోల సంఘం పిలుపు మేరకు ఈనెల 17,18,19వ తేదీల్లో గల మూడు రోజుల పాటు ప్రతి రోజు మధ్యాహ్నం ఒంటి గంట నుండి 2 గంటల వరకు నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఇందులో భాగంగా మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంట నుండి 2గంటల వరకు మండలంలోని వీఆర్వోలు, సంతనూతలపాడు రెవెన్యూ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమంను నిర్వహించారు. వీఆర్వోలు అందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన కార్యక్రమంను చేపట్టారు. పంచాయతీ, రెవెన్యూ శాఖల మధ్య వీఆర్వోలు నలిగిపోతున్నారని ఆదిరెడ్డి ఆరోపించారు. వీఆర్వోలకు డీడీఓలుగా తహసీల్దార్లను నియమించాలన్నారు. ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు ఈఆర్వోలకు వర్క్ టు రూల్ అమలు చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిరెడ్డి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. నేటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముఖ్యంగా ఉద్యోగులు సెలవు దినాల్లో కుటుంబాలతో సంతోషంగా గడపాలని తెలిపారన్నారు. అయితే అధికారులు పండుగలు, సెలవు రోజులు, అర్ధ రాత్రులలో కూడా వీఆర్వోలపై పని ఒత్తిడి పెంచుతున్నారని జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిరెడ్డి ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు. వీఆర్వోలపై పని ఒత్తిడి పెరిగినందు వల్ల వారు గత్యంతరం లేని పరిస్థితుల్లో మానసిక ఆందోళనతో ఒక పక్క ప్రమాదాలు,మరొక పక్క గుండెపోటు , ఆత్మహత్యలకు లోనవుతున్నారని పలువురు వీఆర్వోలు ఈ సందర్భంగా వాపోయారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి వీఆర్వోలపై పని ఒత్తిడి తగ్గించాలని పలువురు డిమాండ్ చేశారు. ముఖ్యంగా వర్క్ రూల్ అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.రవికుమార్, సంతనూతలపాడు మండల వీఆర్వోల సంఘం అధ్యక్షులు ఎం.శ్రీనివాసులు, వీఆర్వో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి.వెంకట స్వామి, జిల్లా మహిళా కార్యదర్శి జి.వినీల,వీఆర్వోలు దాసరి శ్రీనివాసులు, కసుకుర్తి హనుమంతరావు, కే.జాలయ్య, పి.మధుబాబు, షేక్ మౌలాలి, కే.సంజీవరావు, ఎం.మరియకుమార్, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థులకు ప్లేట్స్, గ్లాసులు పంపిణీ



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలం చిలకపాడు హైస్కూల్లో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో వాసవి క్లబ్, వాసవి మహిలా క్లబ్‌లు ఆధ్వర్యంలో దాతలు చిలకపాడు కు చెందిన వాసవి క్లబ్ సభ్యులు పోకూరి రామారావు, వనజ కుమారి దంపతులు 150 మందివిద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి సంబంధించి 20 వేల రూపాయలు విలువ చేసే ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి చిలకపాడు హైస్కూల్ హెచ్‌ఎం పి.స్వప్న రాజు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమాన్ని వాసవి క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ వేమూరి నాగేంద్ర ప్రసాదరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా దాతలను పి.రామారావు, వనజాకుమారి దంపతులను డిప్యూటీ ఎంఈఓ చంద్రమౌళేశ్వర్, ఎంఈఓ డి.వెంకారెడ్డి, హెచ్‌ఎం స్వప్న రాజు, వాసవి క్లబ్ అధ్యక్షులు వేమూరి ఆంజనేయులు, వాసవి మహిళా క్లబ్ అధ్యక్షురాలు వేమూరి నాగమణి, వాసవి క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ వేమూరి నాగేంద్ర ప్రసాదరావు, తదితరులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు పీఎంకే ఆత్రేయ, వాసవి క్లబ్ గౌరవ అధ్యక్షులు వేమూరి వెంకట శేషారావు, వాసవి క్లబ్ సెక్రటరీ శిఖాకొల్లి రాజేష్, కోశాధికారి పామిడి సుధాకర్, వాసవి మహిళా క్లబ్ సెక్రటరీ శిఖాకొల్లి జయశ్రీ, కోశాధికారి జి.శ్రీలక్ష్మి, వాసవి మహిళా క్లబ్ మాజీ అధ్యక్షురాలు జి.వెంకట లక్ష్మి, వాసవి క్లబ్ ప్రతినిధులు వేమూరి ప్రసన్న, రాకేష్, నేరెళ్ల శ్రీనివాసావు, సీహెచ్ వెంకటేశ్వర్లు, ఇన్నమూరి సుబ్బయ్య, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## అక్షర కేంద్రాల అభ్యున్నతిపై అధికారులతో ప్రత్యక్ష సమీక్ష నిర్వహించిన ఎంపీడీవో సురేష్‌బాబు



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయం లో మంగళవారం నాడు మండలంలోని అక్షర కేంద్రాలు అభ్యున్నతిపై అధికారులు, ఉద్యోగులతో ఎంపీడీవో డి.సురేష్‌బాబు సమీక్ష నిర్వహించారు. మండలంలో అక్షర కేంద్రాలు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కేంద్రాలు రన్నింగ్‌లో ఉండాలన్నారు. నిరంతరం కేంద్రాలను తనిఖీ చేపట్టాలన్నారు. ముఖ్యంగా అభ్యాసకుల నుండి అటెండెన్స్ తీసుకోవాలన్నారు. స్టడీ మెటీరియల్ పట్ల వారికి అవగాహన కల్పించాలని ఎంపీడీవో సురేష్‌బాబు సందర్భంగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవోలు రవికుమార్,అరుణకుమారి, వెలుగు ఏపీఎం టి.బాబురావు,అక్షరాంధ్ర యూనిట్ కోఆర్డినేటర్ కే.జ్యోతి, వెలుగు సీసీలు రామాంజనేయులు, శ్రీనివాసులు, చెంచులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## శాసనసభను సందర్శించి పేర్నమిట్ట హైస్కూల్ విద్యార్థులు



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట హైస్కూల్ విద్యార్థులు మంగళవారం నాడు అమరావతిలోని శాసనసభను సందర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ముఖ్యంగా రాష్ట్రంలోని పాఠశాలల విద్యార్థులు శాసనసభ సమావేశాలను సందర్శించడానికి అనుమతి ఇచ్చిన సందర్భంగా ఈ విద్యార్థులు శాసనసభను సందర్శించారు. శాసనసభ జరిగే సమావేశాలను విద్యార్థులు నేరుగా చూసి ఆనందించాలన్నారు. తద్వారా విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, దేశభక్తి, సమాజ సేవ, పట్టుదల, అంకితభావం తదితర వాటి నందు విద్యార్థులు చిన్న వయసులోనే లక్ష్యం ఏర్పాటు చేసుకుంటారని ఉపాధ్యాయులు బి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. 35 మంది విద్యార్థులు శాసనసభను ప్రత్యక్షంగా చూసి ఆనందించారు. మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ఈ సందర్భంగా శాసనసభలో వెలుగొండ ప్రాజెక్టు అభ్యున్నతిపై ప్రసంగం విద్యార్థులు తిలకించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, ముంతాజ్ బేగం, విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ సీహెచ్ అయ్యన్నపాత్రుడు, పేర్నమిట్ట హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పార్వతి, శాంతిలకు విద్యార్థులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## పంటలను పరిశీలించిన ఉద్యానవన శాఖ అధికారి గోపిచంద్



**వెలిగండ్ల, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**
వెలిగండ్ల మండలంలోని పందువనాగులవరం, మారపగుంట, కొటాలపల్లి గ్రామాలలో నిమ్మ, దానిమ్మ, మిరప, కూరగాయల తోటలను జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి వైఎంఎన్‌వీఎస్ గోపిచంద్ మంగళవారం క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. పండ్ల తోటలో చేయాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ గురించి రైతులకు తెలియజేశారు. మిరప పంటలో నల్లతామర పురుగు, రసం పీల్చే పురుగుల నివారణ వివరాలను తెలియజేశారు. అలాగే మిరప, కూరగాయల తోటల్లో పసుపు, బులుగు రంగు జిగురు అట్టలను వాడాలని, సస్యరక్షణలో భాగంగా వేప నూనెని రైతులు వాడాలని సూచించారు. సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించి రైతులు పెట్టుబడులను తగ్గించాలని ఆయన సూచించారు. మండలంలో ఉద్యానశాఖ ద్వారా రాయితీపై కట్టుకునటివంటి ప్యాక్ హౌస్, శాశ్వత పందిరి, నీటికుంటను ఆయన పరిశీలించారు. ఈ రాయితీలను ఉపయోగించుకుని, రైతులు లబ్ధి పొందాలని సూచించారు. అలాగే రబీ ఈ పంటలో భాగంగా నమోదు చేసినటువంటి మిరప పొలంలో సూపర్ చెక్ వెర్ఫికేషన్ చేశారు. కొటాలపల్లి గ్రామంలో ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి విష్ణుప్రియ, మూడు సచివాలయాల ఆర్‌ఎస్‌కే సిబ్బంది బ్రహ్మం, అక్రమ్, స్టీఫన్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## అక్రమ విద్యుత్‌పై విజిలెన్స్ అధికారుల తనిఖీలు



**పుల్లలచెరువు, ఫిబ్రవరి17, ప్రభాతవార్త**
అక్రమంగా విద్యుత్ వాడకంపై విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు మంగళవారం మండలంలోని పలు గ్రామాల పరిధిలోని అధికారులు 45 బృందాలుగా విడివిడిగా విస్తృతంగా తనిఖీలు చేపట్టి అనేక రకాల కేసులు నమోదు చేయడమే కాకుండారూ.5,22,500 అపరాధ రుసుమును విధించినట్లు మార్కాపురం డివిజన్ పర్యవేక్షణ అధికారి పీవీ నాగేశ్వరరావు తెలిపారు.ఈ తనిఖీల్లో 19మంది అధికారులు, 126 మంది సిబ్బంది 45 బృందాలుగా ఏర్పడి మండలంలోని 910 విద్యుత్ సర్వీసులు తనిఖీ చేశారు. మీటర్ ఉండి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 17 మందికి 1,85,000 అనుమతి కన్నా అధిక కేటగిరిలో విద్యుత్ వాడుకుంటున్న 27 మందికి 1,67,500 అపరాధ రుసుము విధించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీవీ నాగేశ్వరరావు, డీపీఈ టి.హైమావతి, ఏడీలు, ఏఈలు, జేఈలు, ఓఅండ్‌ఎం, జేఎల్‌ఎంలు, మిగతా సిబ్బంది పాల్గొన్నారు.

## మాంసం విక్రయశాల కాదు - బల్లికురవ బస్ స్టేషన్



**బల్లికురవ, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**
తెలుగు గ్రామీణ క్రాంతి పథం సౌజన్యంతో తెలుగుదేశం వ్యవస్థాపక అధ్యక్షులు దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు మానస పుత్రికలుగా ఆవిర్భవించిన మండలానికి ఒక బస్ స్టేషన్ నేడు ఆలనాపాలనా కరువు అవటంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. బల్లికురవ నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న బస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం మధ్యాహ్నం ఈ విధంగా పందిని కాల్చి మాంసాన్ని నరుకుతున్నారు. సంచార జాతులు తమ నివాస స్థావరంగా బస్ స్టేషన్ భవనాన్ని మార్చుకొని నిత్యం ఇలాంటి దౌర్భాగ్యకరమైన పరిస్థితికి బస్ స్టేషన్ భవనాన్ని చిరునామాగా మార్చారు. అంతే కాకుండా బస్ స్టేషన్ చుట్టూ ఆక్రమణలతో మురుగునీటికి ఆవాసంగా మారి పాలకుల నిర్లక్ష్యాన్ని వెక్కిరిస్తుంది. ఒక వైపు చికెన్ దుకాణాల వ్యర్థాలు, మరొక వైపు హోటళ్లు మురుగునీరు అంతా బస్‌స్టేషన్ ఆవరణలోకే.ఆ నీటిలోనే సంచార జాతుల పందులు సంచరిస్తుంటాయి. మండల కేంద్రమైన బల్లికురవలో నాలుగు రోడ్ల కూడలిలో తహసీల్దార్ కార్యాలయానికి కూత వేటు దూరంలో లక్షలాది రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తి ఈ విధంగా దుర్వినియోగమవుతున్నా అటు ఆర్టీసీ అధికారులకు గాని, ఇటు పాలకులకు గాని పట్టదు. ఫలితంగా ముక్కు మూసుకుని రహదారి వెంట నడవాల్సిన దుస్థితి దాపురించింది.

## రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ విజేతలను అభినందించిన

### జై సూర్య సోలార్ లిమిటెడ్ ఓంకార్ మినరల్స్ అధినేతలు



**మార్టూరు,ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**
ఈనెల 13,14,15వ తేదీలలో శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం పీఎంశ్రీ ఎంపీ ఎల్ గర్ల్స్ హైస్కూల్ నందు 44వ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ అండర్-17 బాల బాలిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు రాష్ట్రం నుండి 12 జిల్లాలు పాల్గొనగా బాపట్ల జిల్లా బాలుర విభాగంలో ప్రకాశం జిల్లా పై రెండు సున్నా తేడాతో విజయం సాధించిమూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. అలాగే బాలికల విభాగంలో అనంతపూర్ జిల్లాపై రెండు సున్నా తేడాతో విజయం సాధించి రెండవ స్థానం సాధించింది. ఈ సందర్భంగా మార్టూరులోని జై సూర్య ఎనర్జీ లిమిటెడ్ ఆఫీసు నందు జరిగిన అభినందన కార్యక్రమంలో జై సూర్య ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ జరుగుల లక్ష్మీ నారాయణ అలాగే ప్రముఖ పారిశ్రామిక వేత్త ఓంకారం మినరల్స్ మేనేజింగ్ డైరక్టర్ పొత్తూరి శివరావు విజయం సాధించిన బాల బాలికలను అభినందిస్తూ గతంలో జరిగిన 44వ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ జూనియర్ బాల బాలికల పోటీలను మార్టూరులో దిగ్విజయంగా నిర్వహించామని బాపట్ల జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్‌కి తమ యొక్కకృషి సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలియజేశారు. మే నెలలో 29,30,31వ తేదీలలో మార్టూరులోని ఓం కార్ మినరల్స్ పక్కన ఉన్నటువంటి యాపిల్ గ్రౌండ్స్ ప్రాంగణంలో 44వ షూటింగ్ బాల్ జాతీయ స్థాయి సబ్ జూనియర్, జూనియర్ బాల బాలికల పోటీలను నిర్వహిస్తున్నట్లు జరుగుల లక్ష్మీ నారాయణ పొత్తూరి శివరాం ఉమ్మడిగా ఒక ప్రకటనలో తెలియజేశారు. క్రీడాకారులను ఆశీర్వదిస్తూ జాతీయ స్థాయిలో మన రాష్ట్రానికి మంచి పేరు తేవడానికి తమ వంతు కృషి ఉంటుందని దానికి తగినట్టుగా క్రీడాకారులను మంచి నైపుణ్యాన్ని మరింతగా మెరుగుపరచాలని కోచస్‌కి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్ర, బాలుర కోచ్ అనిల్ కుమార్, బాలికల కోచ్ కోడి రెక్క ధనలక్ష్మి, మేనేజర్ అన్నమ్మ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## దగాపడ్డ రాష్ట్రానికి దశాదిశను చూపే బడ్జెట్

- దూరదృష్టి సమర్ధ నాయకత్వానికి బ్రాండ్ సిబిఎన్
- గత వైసీపీ తప్పిదాలను సరిచేస్తూ...
- చంద్రబాబుపాలన పారదర్శకతకు పునాది
- ఆంధ్రప్రదేశ్ బడ్జెట్‌పై సభలో ఎమ్మెల్యే ఏలూరి ప్రశంసలు



**మార్టూరు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**
దగాపడ్డ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి దశ దిశా చూపి ఐదు కోట్ల ఆంధ్రుల ప్రజల ఆశల ఆకాంక్షలను ఆవిష్కరించే దార్శనిక నేత చంద్రబాబు ఉక్కు సంకల్పానికి ప్రత్యేకంగా నిలిచే భవిష్యత్తు మార్గదర్శిని ఏపీ బడ్జెట్ అని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. మంగళవారం అసెంబ్లీ వేదికగా బడ్జెట్‌పై సుదీర్ఘంగా ప్రసంగించారు. గత వైసీపీ ప్రభుత్వ అహంకారం, అధికార దుర్వినియోగం, స్వార్థం బాధ్యతరాహిత్యం, అసమర్థతను సభ సాక్షిగా కళ్ళకు కట్టినట్లుగా చూపారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై జరిగిన చర్చ సందర్భంగా సభ్యులు ప్రభుత్వ దిశానిర్దేశక ఆలోచనను ప్రశంసించారు. బడ్జెట్‌పై మాట్లాడే అవకాశం కల్పించిన స్పీకర్‌కి కృతజ్ఞతలు తెలిపారు. బడ్జెట్ కేవలం ఆదాయం వ్యయాల లెకనకల సమాహారంమాత్రమే కాదని, ప్రభుత్వ ఆలోచన దిశానిర్దేశ పత్రం అని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత, అభివృద్ధి లక్ష్యాలు, పారదర్శకతను ఈ బడ్జెట్ స్పష్టంగా ప్రతిబింబిస్తోందని అభిప్రాయపడానడరు. దగా పడిన రాష్ట్రానికి అండగా సీబీఎన్ బ్రాండ్ అన్నారు. అంకెల వెనుక ఒక ఆలోచన ఉందని.. ఆలోచనకు ఒక దూరదృష్టి ఉంది. ఆ దూరదృష్టి వెనుక ఒక నాయకత్వం ఉందని ఆ నాయకత్వానికి ఒక రూపం ఉందని ఆ రూపానికి ఒక బ్రాండ్ ఉందని అదే సీబీఎన్ అన్నారు. విభజన గాయాలు వైసీపీ దుర్మార్గపు పాలన అన్నారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రానికి విభజన గాయాలు ఒక వైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిపాలన రెండో దెబ్బగా వర్ణించారు. గత వైసీపీ ప్రభుత్వ బకాయిలు ఈ ప్రభుత్వానికి వారసత్వంగా వచ్చాయని రూ.3లక్షల కోట్లలో ప్రభుత్వం చెల్లించాల్సిన బిల్లులు ఎన్‌ఆర్‌ఈజీఎస్, కాంట్రాక్టర్ బిల్లులు, కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులు ఇతర పథకాలకు వాడినవి చెల్లించాల్సిన 70,80 వేల కోట్లు ఇలా మొత్తం కలుపుకొని 10 లక్షల కోట్ల అప్పులు, రూ.3లక్షల కోట్ల బకాయిలు, ఈ పరిస్థితులలో ప్రతి ఏడాది 35 వేల నుంచి రూ.40వేల కోట్లు ఈఎంఐలు వడ్డితో సహా చెల్లిస్తున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. ఆర్థిక క్రమశిక్షణ,సామాజిక బాధ్యత,క్యాపిటల్ ఎక్స్పెండిచర్, సమగ్రాభివృద్ధి, పారదర్శకత కనిపిస్తుందన్నారు. ఆదాయానికి మించిన ఖర్చులను నియంత్రణ చేయడం, తెచేనచ అప్పులకు బాద్యతాయుతమైన ఆదాయ వనరులను సృష్టించడం, అప్పులను తిరిగి చెల్లించేలా ప్రణాళికలు రూపొందించడం, రెవెన్యూ, ఆర్థిక లోటులను తగ్గించుకుంటూ ప్రభుత్వ రోజువారి ఖర్చులకు అప్పులు చేయకుండా స్థిరమైన ఆర్థిక పరిస్థితి ప్రభుత్వానికి ఉండాలని బడ్జెట్ రూపకల్పన చేశారన్నారు. పారదర్శక పాలనపై దృష్టి సారిస్తున్నారన్నారు. వైసీపీ ఆరోపణలను తిప్పి కొట్టాలన్నారు. గత ఆర్థిక మంత్రి బుగ్గన.. వాళ్ళ నాయకుడు జగన్ మెప్పు పొందేందుకు బడ్జెట్‌పై రకరకాల కట్టుకథలు అల్లారు అన్నారు. సాక్షి పత్రికలో ప్రచారం చేశారు అని అన్నారు. 2018-19 వృద్ధి రేటును 15.3 ఉంటే చివరిలో 11.14 రివైజ్ అయిందని అది చెప్పకుండా 22లో ఉన్న రాష్ట్రాన్ని 4 స్థానానికి తీసుకొచ్చామని గొప్పలు చెప్పారు. వాస్తవంగా ఆ రోజు వారు ఎంతకు బరితెగించారంటే రికార్డులను ట్యాంపర్ చేసి ప్రభుత్వ కాగ్ లెక్కలను తారుమారు చేశారన్నారు. బడ్జెట్లో కేటాయింపులు పెంచేలా చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు. దగాపడ్డ ఏపీకి ఒక దశ దిశ ను చూపే సమగ్ర ప్రణాళిక, దార్శనిక నాయకుని ఉక్కు సంకల్పానికి ప్రతీక అన్నారు. ఐదు కోట్ల మంది ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆశలు ఆకాంక్షలను ఆవిష్కరించే భవిష్యత్తు మార్గదర్శిని అన్నారు. స్థిరత్వం పారదర్శకత అభివృద్ధి అనే మూడు విలువలపై నిర్మితమైన భవిష్యత్తు ప్రయాణానికి మార్గం అన్నారు.

## అయినముక్కల గ్రామంలో పొలం పిలుస్తోంది



**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**
పెద్దదోర్నాల మండలంలోని అయిన ముక్కలగ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈకార్యక్రమం లోమండల వ్యవసాయాధికారి డి.జవహర్ లాల్ నాయక్ పాల్గొని గ్రామంలో సాగులో ఉన్న జొన్న పంటలను సందర్శించడం జరిగింది. రబీలో సాగుచేసిన పంటలను 20.02.2026 తేదీలోపల అందరూఈ పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. పీఎం కిసాన్ పథకం కింద నమోదు అయిన ప్రతి రైతు తప్పనిసరిగా రైతు విశిష్ట నమోదు సంఖ్య గ్రామ వయవసాయ సహాయకులు వద్ద నమోదు చేపించుకోవాలన్నారు. అలా చేపించని రైతులకు పీఎంకిసాన్ నగదు జమ కాదు కాబట్టి రైతులు తప్పనిసరిగా చేసుకోవాలి. అలాగే రైతు యాప్ అవగాహన కల్పించి, రైతు ఈకేవైసీ కూడా చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏ ఎం.శివ శైలజ రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

- టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి



**హనుమంతునిపాడు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**
విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని నందనవనం జడ్పీ హైస్కూల్ నందు పదవ తరగతి విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్స్, పెన్సిళ్లు, ఎరేజర్, రబ్బర్లు, స్కేల్స్‌లను సానికొమ్ము తిరుపతి రెడ్డి చేతుల మీదుగా నందనవనం గ్రామ వాసి షేక్ నాసర్ మహమ్మద్ అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ మన రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సమాజ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువుతో పాటు వినయం, విధేయత, సంస్కారం, మానవతా విలువలను కూడా నేర్పించాలన్నారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి విద్యనభ్యసించి రాబోయే పరీక్షలలో అధిక మార్కులు సాధించి తమ తల్లిదండ్రులకు తమ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల యూనిట్ ఇన్‌చార్జి రాజారామిరెడ్డి, మండల కార్యదర్శి సుమిత్ర తిరుపతిరెడ్డి, ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు చీకటి వెంకట సుబ్బయ్య, షేక్ షఫీ, నీటి సంఘం అధ్యక్షులు పెన్నా గురవయ్య, షేక్ పీరయ్య, గిద్ద గరటయ్య, షేక్ కాశీం, మహమ్మద్ హుస్సేన్, ఫీల్డ్‌అసిస్టెంట్ రావినూతల కిషోర్, రావినూతల బాలయ్య, పరిశపోగు యేసయ్య, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి నైపుణ్యం కలిగి ఉండాలి



**తాళ్లూరు, ఫిబ్రవరి 17,ప్రభాతవార్త**
మండలంలోని తూర్పు గంగవరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎం శ్రీ ద్వారా నూతనంగా ఏర్పాటు చేసిన ఒకేషనల్ ల్యాబ్‌ను జిల్లా జీసీడీఓ హేమలత ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఒకేషనల్ ల్యాబ్ కోర్సు ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలోప్రధానోపాధ్యాయులు వైఎస్ఆర్ కే ప్రసాద్, ఎస్ఎంసీ ఛైర్మన్ శంషాద్ బేగం, జిల్లా ఒకేషనల్ కోఆర్డినేటర్లు కిషోర్, మురళి,ట్రైనర్స్ యారగొర్ల అంజిబాబు,సీహెచ్ దావీదు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు .

## వేధింపులకు పాల్పడితే ఉద్యమిస్తాం



**తాళ్లూరు, ఫిబ్రవరి 17,ప్రభాతవార్త**
రకరకాల సర్వేలు, పనులతో వీఆర్వోలను ఉన్నతాధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని ఇదే పరిస్థితి కొనసాగితే ఉద్యమబాట పడతామని వీఆర్వోలు హెచ్చరించారు.స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో మంగళవారం వీఆర్వోలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. వీఆర్వోలపై రకరకాల సర్వేలతో అదనపు భారాన్ని మోపుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో విధులు నిర్వర్తించలేమని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం స్పందించి వీఆర్వోలపై అదనపు భారాన్ని తగ్గించి ప్రభుత్వపరంగా ఉన్న విధులను మాత్రమే అప్పజెప్పాలని కోరారు.అనంతరం తహసీల్దారు బచ్చుల వెంకట రమణారావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామల వీఆర్వోలు పి.చంద్రశేఖర్‌రావు,శివారెడ్డి,ఎం. రమణారెడ్డి,నాగలక్ష్మి, నాగూర్ బీ, రమణలు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యం

- విద్యుత్‌శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు





**తాళ్లూరు, ఫిబ్రవరి 17,ప్రభాతవార్త**
విద్యుత్ వినియోగదారులకు అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే సంస్థ లక్ష్యమని విద్యుత్‌శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం స్థానిక సబ్‌స్టేషన్‌లో సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా సబ్‌స్టేషన్‌లో వీసీబీలు, పీటీఆర్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ తో పాటు మెరుగైన సేవలు అందించాలన్నారు.వినియోగదారుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా సిబ్బంది పని చేయాలన్నారు.వినియోగదారులతో గౌరవం, స్నేహ పూర్వకంగా మెలగాలన్నారు. ఐవీఆర్ఎస్ కాల్స్ 75 శాతం నమోదు అయింది, 100 శాతం పురుగోతి సాధించాలన్నారు.రానున్న వేసవిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం,లో ఓల్టేజ్‌సమస్య తలెత్తకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. మండలంలో వ్యవసాయ, గృహ,వాణిజ్య బిల్లులువిద్యుత్ బకాయిలు పేరుకుపోయాయని,వాటి వసూలుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వసూలు చేయాలన్నారు.నెలవారీ విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటున్నా గృహాల యజమానులు సోలార్ విధానం లోకి మారేలా చొరవ తీసుకువాలన్నారు. ఇంటి పైన సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకోనేందుకు ప్రభుత్వం ఇస్తున్న రాయితీ, మిగులు విద్యుత్తును ప్రభుత్వానికి విక్రయించడం ద్వారా కలిగే ఆర్థిక ప్రయోజనాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో దర్శి ఈఈ పాలగిరి శ్రీనివాసులు, డీఈఈ రవి కుమార్, ఏఈ ఎం.రామకృష్ణ,ఎల్ఐ లు వీవీఎస్ కాంతారావు, ఆళ్ల శ్రీనివాసరావు, లైన్ మాన్ లు, అసిస్టెంట్ లైన్ మాన్‌లు, ఎనర్జీ అసిస్టెంట్‌లు, షిఫ్ట్ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

## ఆల్బెండజోల్‌తో నులిపురుగుల నివారణ



**తాళ్లూరు, ఫిబ్రవరి 17,ప్రభాతవార్త**
పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించడం వలన రక్తహీనత నివారించి పౌష్టికాహార లోపం దరిచేరనీయకుండా చేసి సంగ్రహణశక్తి పెంచుతుందని తాళ్లూరు, తూర్పు గంగవరం ప్రాథమిక వైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్, మోనిక, శ్రీకాంత్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం పీహెచ్‌సీల పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ, అంగన్ వాడీ,ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు1 సంవత్సరం నుంచి19 సంవత్సరాల్లోపు పిల్లలందరికీ ఆల్బెండో జోల్ మాత్రలు మింగిచారు.ఆయా కార్యక్రమాల్లో సిబ్బంది చంద్రశేఖర్ బాబు, రవి,సుశీల, రమణమ్మ, ఉపాధ్యాయులు,ఏఎన్‌ఎంలు,ఆశా కార్యకర్తలు,అంగన్ వాడీ సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

## మైనారిటీ సంక్షేమానికి పెద్దపీట

- కూటమి ప్రభుత్వానికి అభినందనలు షేక్ అబ్దుల్ అజీమ్



**సింగరాయకొండ, ఫిబ్రవరి 17,ప్రభాతవార్త**
రాష్ట్రంలో మైనారిటీల అభివృద్ధి,సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనివ్వడం శుభపరిణామమని తెలుగుదేశం పార్టీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర కార్యదర్శి షేక్ అబ్దుల్ అజీమ్ అన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మైనారిటీ సంక్షేమం కోసం రూ.3,766 కోట్లు కేటాయించగా, 2026-27 బడ్జెట్‌లో భారీగారూ.6,090 కోట్లు కేటాయించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు.ఇమామ్‌లకు నెలకు రూ.10,000, మోజనులకు రూ.5,000 గౌరవ వేతనం అందించడం ద్వారా ప్రభుత్వం మైనారిటీలకు అండగా నిలుస్తోందన్నారు. మైనారిటీ ఆస్తుల పరిరక్షణ, సమర్థవంతమైన నిర్వహణ కోసం వక్ఫ్ బోర్డులను పునరుద్ధరించడం ద్వారా ఆర్థిక భరోసా కల్పించినట్లు తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో మైనారిటీలకు న్యాయం జరుగుతోందని అన్నారు.కొండెపి ఎమ్మెల్యే, మంత్రివర్యులు డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి,మారిటైన్ బోర్డు ఛైర్మన్ దామచర్లసత్య సారథ్యంలో నియోజకవర్గం లో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ముస్లిం మైనారిటీలు కూటమి ప్రభుత్వానికి మద్దతు తెలపనున్నట్లు అజీమ్ విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఘనంగా జాతీయ నులిపురుగుల దినోత్సవం



**సింగరాయకొండ, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**
జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా సింగరాయకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు.డాక్టర్ ఆయేషా, డాక్టర్ రవి ఆధ్వర్యంలో Dr. బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు మింగించారు. అలాగే డాక్టర్ ధీరేందర్, డాక్టర్ వంశీధర్ పాత సింగరాయకొండలోని బాయ్స్ హై స్కూల్లో విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించి, అనంతరం మాత్రలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, శారీరక ఎదుగుదల లోపం, కడుపునొప్పి,బలహీనత, ఆకలి తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. భోజనం ముందు, మల విసర్జన అనంతరం చేతులను శుభ్రంగా కడుక్కోవడం అలవాటు చేసుకోవాలని సూచించారు.మండలమంతటా మొత్తం 13,855 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పీరయ్య, కళ్యాణి, ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్ అలీ, కూనపురెడ్డి రాజమ్మ, ఆరోగ్య సహాయకులు సుభాకర్, రాధా, రాధిక, మనీషా, తేజస్వి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఒంగోలు - చీరాల హైవేపై చేకూరపాడు వద్ద రోడ్డు ప్రమాదం

- ఒకరు మృతి.. ఒకరి పరిస్థితి విషమం





**నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**
నాగులుప్పపాడు మండలం మద్దిరాలపాడు, చేకూరపాడు గ్రామాలకు చెందిన పచ్చాకు కూలీల ముఠా చేకూరపాడు వద్ద పొలంలో పచ్చాకు ట్రాక్టర్‌కి నింపుకుని హైవే పైకి వస్తుండగా ఒక్క సారిగా ట్రాక్టర్ అదుపు తపినప తిరగబడడంతో ట్రాక్టర్‌పై కూర్చున్న కూలీలు కిందపడగా వాళ్లపైన పచ్చాకు పడడం జరిగింది. వీరిలో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదంలో గాయపడిన వారు మద్దిరాలపాడు, చేకూరపాడు గ్రామాలకు చెందిన వారిగా గుర్తించారు. 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఒంగోలు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీరిలో ఎమేలమ్మ, అనే కూలి మృతి చెందింది. మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

# పశు సంపదను కాపాడుకోవాలి



**వలేటివారిపాలెం, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

రాష్ట్ర పశుగణాభివృద్ది సంస్థ రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆర్థిక సహకారంతో లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం వలేటివారిపాలెంలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంను ప్రాథమిక సహకార సంఘ అధ్యక్షులు గుత్తా మహేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో ముఖ్య అతిధిగా పాల్గొన్న పశు సంవర్ధకశాఖ కందుకూరు డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ జి.శ్రీధరరావు మాట్లాడుతూ సకాలంలో దూడలకు, గేదెలకు నులి పురుగుల మందులు, టీకాలను ముందస్తుగా వేసి పశు సంపదను కాపాడుకోవాలని, తద్వారా పశుపోషకుల ఆదాయం పెరుగుతుందని తెలియజేశారు. కందుకూరు సహాయ సంచాలకులు డాక్టర్ జే.చంద్రమోహన్ మాట్లాడుతూ హరిత గోపాలం పథకం ద్వారా బహువార్షిక పశుగ్రాసాలు ఉపాధి హామీ పథకం ద్వారా సాగు చేసుకోవచ్చని తెలియజేశారు. వలేటివారిపాలెం సహాయ సంచాలకులు డాక్టర్ ఇ.చెన్నకేశవులు మాట్లాడుతూ లేడ దూడల సంరక్షణ దూడలకు జున్ను పాలు ప్రాముఖ్యత గురించి ఒక పాడి పశువులు ఇంటిలో ఉంటే ఒక ఎకరాతో సమానంగా ఆదాయం వస్తుందని తెలియజేశారు. మండల పశు వైద్యులు డాక్టర్ ఎస్.సుధాకర్ మాట్లాడుతూ పాలనలో వెన్న శాతం పెరుగుటకు సూచనలు, సలహాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చిన్న పవని పశువైద్యులు డాక్టర్ బి.సుబ్రహ్మణ్యం, కోవూరు పశు వైద్యులు వై.శ్రీకాంత్, మాజీ సొసైటీ ప్రెసిడెంట్ వలేటి నరసింహం, మాజీ ఎంపీటీసీ సలహాదారులు వలేటి నరసింహం, డీలర్ కాకుమాని ఆంజనేయులు, నాయకులు వలేటి మధు, అనంతరం దూడలు అందాల పోటీలలో గెలుపొందిన లేగ దూడల యజమానులకు బహుమతులతో పాటు మినరల్ బ్రిక్స్, నులి పురుగుల మందులు, లివర్ టానిక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీలత లైవ్ స్టాక్ అసిస్టెంట్, పశు సహాయకులు కిరణ్, తిరుణ్, రమేష్, అశోక్, చౌదయ్య, వెంకటరావు, మౌనిక, లీల, మనోహర్, ప్రవీణ్, వినోద్ చౌదయ్య, శరత్ పాల్గొన్నారు.

# జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

**- కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం - వైద్యాధికారిణి మల్లెల జాస్మిన్**



**ముండ్లమూరు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం లో ముండ్లమూరు వైద్యాధికారిణి ఎం.జాస్మిన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మొత్తం 450 మంది బాలికలకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేయబడింది. ఈ మాత్రలు పేగు నులి పురుగుదల నిర్మూలించడం ద్వారా బాలికల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఈ సందర్భంగా విద్యార్ధినులకు ఆరోగ్య, విద్య, పరిశుభ్రతపై అవగాహన కలినపంచబడింది. ముఖ్యంగా చేతులు సరిగ్గా కడుక్కోవడం యొక్క ప్రాముఖ్యత, క్రిముల వల్ల కలిగే పోషకాహార లోపాలు, రక్తహీనత వంటి సమస్యల గురించి వివరించబడింది. నులి పురుగుల సంక్రమణ వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు తగ్గిపోవడం, దాని వల్ల అలసట, బలహీనత, ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని తెలియజేయబడింది. విద్యార్ధినులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం, భోజనం ముందు, మరుగుదొడ్డిని ఉపయోగించి తర్వాత చేతులు సబ్బుతో కడుకోనకవడం, శుభ్రమైన ఆహారం తీసుకోవడం వంటి మంచి అలవాట్లు అలవర్చుకోవాలని సూచించబడింది. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంతో పాటు, బాలికల ఆరోగ్య పరిరక్షణలో ఇది ముఖ్యమైన ముందడుగుగా నిలిచింది.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఆరోగ్యసిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అత్యంత వైభవంగా ప్రారంభమైన శివపార్వతుల రథ మహోత్సవం

**- రథాన్ని లాగిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, లలిత్ సాగర్ దంపతులు**







**దర్శి, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

దర్శిపట్టణం, అద్దంకి రోడ్డులోని శివాలయం దేవస్థానం వద్ద మంగళవారం శివాలయంలో విశేష పూజలు నిర్వహించి తదుపరి అలంకరించబడిన రథంపై శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ఉంచి ఊరేగింపుగా రథాన్ని లాగి ప్రారంబించిన దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ - లలిత్ సాగర్ దంపతులు. వారితో పాటు మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, దేవస్థాన చైర్మన్ నారపుశెట్టి శివ, దర్శి సీఐ రామారావు, ఎస్సై మురళి, ఎమ్మార్వో శ్రవణ్ కుమార్ కమిటీ సభ్యులు, భక్తులు ఉన్నారు. శివపార్వతుల రథ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. శివనామ స్మరణతో మార్మోగిన దర్శి పట్టణంలోని పురవీదులు, రథాన్ని లాగడం భక్తులకు ఒక గొప్ప ఆధ్యాతినమక అనుభూతిగా, పుణ్యకార్యంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కూటమి శ్రేణులు, మహిళలు, పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.

## భారత్ విస్తార్ చారిత్రాత్మక ప్రారంభోత్సవ కార్యక్రమం వీక్షణ



**దర్శి, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ భారత్ విస్తార్ చారిత్రాత్మక ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని జైపూర్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని రైతుల అవగాహన నిమిత్తం దేశంలోని అన్ని కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా వర్చువల్ విధానం ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఈ కార్యక్రమాన్ని కేవీకే కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ జి.రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కేవీకే హెడ్ మాట్లాడుతూ భారత్ విస్తార్ అనేది 2026 బడ్జెట్‌లో ప్రవేశపెట్టబడిన ఒక విప్లవాత్మక ఏఐ ప్లాట్‌ఫారమ్, దీని ద్వారా డిజిటల్ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, దేశీయ ఏ1 సామర్ధ్యాలను విస్తరించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. భారతీయ సాంకేతిక రంగంలో చారిత్రాత్మక మార్పులకు నాంది పలకబోతుందని, దీని ద్వారా వ్యవసాయ రంగంలో విన్నూత్న మార్పులను తీసుకురాబోతోందన్నారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ టి.వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ టి.మానస, రైతులు పాల్గొన్నారు.

# కెల్లంపల్లి, పసుపుగల్లులో పొలం పిలుస్తోంది



**ముండ్లమూరు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

మండలంలోని కెల్లంపల్లి, పసుపుగల్లు గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికాఇ తిరుమలరావు మాట్లాడుతూ ప్రతి రైతు రబీ సీజన్ 2025-26 లో వేసిన ప్రతి పంటను పంట నమోదు చేసుకోవాలన్నారు. రబీ 2025-26 సీజన్లో సాగు చేసిన ప్రతి పంటలను ఈ పంట నమోదు చేయాలని చెప్పారు. అదే విధంగా మండలంలోని అన్ని గ్రామాల రైతులందరూ ఫార్మర్ ఐడీ రైతు నమోదు సంఖ్య కలిగి ఉండాలని రైతు రిజిస్ట్రేషన్ ఐడీ ఉంటేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ పథకాలు అందుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు విజయనిర్మల, సువర్చల, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## రధోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించిన ముత్తుముల క్రిష్ణకిషోర్‌రెడ్డి



**గిద్దలూరు, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త**

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గిద్దలూరు పట్టణంలో మంగళవారం నిర్వహించిన శ్రీ పాతాళ నాగేశ్వర స్వామివారి రధోత్సవ కార్యక్రమాన్ని కార్యనిర్వహణ అధికారి చిక్కుడు శ్రీనివాసులు, దేవాలయం కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు తెలుగుదేశం పార్టీ నాయకుడు ముత్తుముల క్రిష్ణ కిషోర్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. రధోత్సవ కార్యక్రమం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక హారతులిచ్చి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో కలిసి రథాన్ని లాగి రధోత్సవాన్ని శుభారంభం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహా శివరాత్రి పర్వదినం ఆధ్యాత్మిక భావనను పెంపొందించే పవిత్రమైన రోజు అని తెలిపారు. భగవంతుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. రధోత్సవం కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొని భక్తి శ్రద్ధలతో కార్యక్రమం ఎంతో ఉత్సాహంతో నిర్వహించారు. రధోత్సవ కార్యక్రమం ఆద్యాంతం భక్తుల హరహర మహాదేవ్ శంభోశంకర, ఓం నమ:శివాయ శివనామస్మరణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

# మార్కాపురం మహిళకు జాతీయ గుర్తింపు

**- నేషనల్ ఉమెన్ సెల్ వైస్ చైర్మన్‌గా షేక్ షబానా**



**మార్కాపురం, ఫిబ్రవరి 17,ప్రభాతవార్త**

విజయవాడలోని అఖిల భారత బిసి సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన బడుగు బలహీన వర్గాల పోరాట వేదిక కార్యక్రమంలో మార్కాపురం జిల్లాకు చెందిన షేక్ షబానాకు జాతీయ స్థాయి బాధ్యత దక్కింది. ఆల్ ఇండియా బిసి ఫెడరేషన్ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ సత్యవాడ శ్రీనివాస్ (ఉండి వాసు) ఆమెను నేషనల్ ఉమెన్ సెల్ వైస్ చైర్మన్గా నియమించారు. భారతీయ జనతా పార్టీ మైనార్టీ మోర్చాలో క్రియాశీలకంగా పనిచేస్తున్న షేక్ షబానా, మార్కాపురం జిల్లా మరియు పరిసర ప్రాంతాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందారు.ఆమెసేవలను గుర్తించిన అధిష్టానం ఈ కీలకబాధ్యతను అప్పగించడం అభినందనీయమని పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా షేక్ షబానా మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ,మహిళల హక్కులు,బడుగు బలహీనవర్గాల సంక్షేమం కోసం మరింత కృషి చేస్తానని అన్నారు.ఈ అవకాశాన్ని కల్పించిన ఆల్ ఇండియాబిసి ఫెడరేషన్ నేషనల్‌ప్రెసిడెంట్ డాక్టర్ సత్యవాడ శ్రీనివాస్‌కు ప్రత్యేకధన్యవాదాలు తెలిపారు.

## చదువుతోపాటు ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి

**- జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో జేసీ శ్రీనివాసులు సూచన**



**మార్కాపురం, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

విద్యార్థులు చదువుతోపాటు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు.మార్కాపురం పట్టణంలోని జడ్పి బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీశ్రీనివాసులు మాట్లాడుతూ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టితో పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు ప్రతిరోజు వ్యక్తిగత శుభ్రతను పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. మార్కాపురం డీఎంహెచ్ఓ టి వాణిశ్రీ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి, ఆగస్టు నెలల్లో రెండుసార్లు నిర్వహిస్తామని తెలిపారు. ఒకటి నుంచి 19 సంవత్సరాల లోపు విద్యార్థులు ఈ అవకాశాన్ని తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మార్కాపురం జిల్లాలో మొత్తం 2.93 లక్షల మంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు అందించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి కె రాహుల్, మార్కాపురం డిప్యూటీ డీఎంహెచ్ఓ మనస్సే, కనిగిరి డిప్యూటీ డీఎంహెచ్ఓ సుజన, ప్రోగ్రాం అధికారి చంద్రశేఖర్, రాష్ట్ర కన్సల్టెంట్ నరేష్, గంగాధర్ తదితర ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# చంద్రన్న మార్కాపురం జిల్లాగా పేరు పెట్టాలి

**- అసెంబ్లీలో విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి**



**మార్కాపురం, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి మంగళవారం ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో సుదీర్ఘంగా మాట్లాడారు. మార్కాపురం జిల్లాను ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ నూతన జిల్లాకు చంద్రన్న మార్కాపురం జిల్లాగా పేరు పెట్టాలని సభా సాక్షిగా విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఒప్పించాలని అసెంబ్లీ సభ్యులందరిని కోరారు. అనంతరం రైతుల సమస్యలను ప్రస్తావించిన ఎమ్మెల్యే గత వైసీపీ పాలనలో రైతులు తీవ్రంగా నష్టపోయారని గణాంకాలతో సహా వివరించారు. ముఖ్యంగా వెలుగొండ ప్రాజెక్టు విషయమై మాట్లాడుతూ ప్రాజెక్టు పూర్తి కాకుండానే గత ప్రభుత్వం జాతికి అంకితం చేశామని ప్రకటించి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో వెలుగొండ ప్రాజెక్టు పనుల పురోగతిపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఒకే నెలలో నాలుగు సార్లు పర్యటించడం చరిత్రలో లేనిదని, ప్రాజెక్టు పూర్తి చేయడంపై ప్రభుత్వం ఎంత కృతనిశ్చయంతో ఉందో దీనితో స్పష్టమవుతుందని తెలిపారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తయితే మార్కాపురం ప్రాంత రైతులకు శాశ్వత సాగునీటి సౌకర్యం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆటో బోల్తాపడి వ్యక్తికి తీవ్రగాయాలు - మరో మహిళకు స్వల్పగాయాలు





**రాచర్ల, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

ఆటో బోల్తా పడి ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా మరో మహిళకు స్వల్ప గాయాలైన సంఘటన మండలంలోని కాల్వపల్లి బస్టాండ్ విస్కస్ పాల డైరీ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు కంభం మండలం తురిమెళ్ళ గ్రామానికి చెందిన చెన్నకేశవుల పాండు అను వ్యక్తి అదే గ్రామానికి చెందిన లంక నాగలక్ష్మి క్కి సంబంధించిన వరి ధాన్యాన్ని మర పట్టించేందుకు గిద్దలూరు తీసుకువెళ్లి మర పట్టించుకుని తిరిగి తురిమెళ్ళ వెళ్తుండగా విస్కస్ పాల డైరీ దగ్గర ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. దీంతో ఆటో నడుపుతున్న చెన్నకేశవుల పాండుకు తీవ్ర గాయాలు కాగా పక్కన కూర్చున్న లంక నాగలక్ష్మికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది రమణ, రసూల్‌లు గాయపడ్డ వారికి ప్రథమ చికిత్సచేసి అనంతరం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తీసుకువెళ్లాలని సూచించడంతో కుటుంబ సభ్యులు గాయపడిన పాండును నంద్యాలకు తరలించారు. ఈ సంఘటనపై రాచర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కంభంలో పలు లాడ్జిలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్సై శివకృష్ణారెడ్డి



**కంభం, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త**

కంభం పట్టణంలోని పలు లాడ్జిలను కంభం మండలం ఎస్సై శివ కృష్ణారెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఈ తనిఖీలు చేపట్టామన్నారు. లాడ్జిలలో బస చేసిన వారి వివరాలను, ఐడి కార్డులను, రిజిస్టర్లను ఎస్సై శివకృష్ణారెడ్డి క్షుణ్ణంగా పరిశీలించారు. లాడ్జిల యజమానులకు,సిబ్బందికి పలుసూచనలు జారీ చేశారు. అనుమానిత వ్యక్తులు ఎవరైనా లాడ్జీలకు వస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ త్రిపురాంతకేశ్వర స్వామి రధోత్సవం

**- రధోత్సవంలో పోటెత్తిన జన సందోహం**



**త్రిపురాంతకం, ఫిబ్రవరి 17,ప్రభాతావార్త**

మహాశివరాత్రి మహోత్సవాలు మూడు రోజులపాటు త్రిపురాంతక క్షేత్రంలో వేద పండితులచే, మేళతాళాలతో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు 15వ తేదీ రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించిన స్వామివారి కళ్యాణ మహోత్సవం తిలకించి అనంతరం జరిగిన లింగోద్భవ దర్శనం చేసుకున్నారు. మూడవ రోజు మంగళవారం జరిగిన ఈ రథోత్సవ కార్యక్రమం భక్తుల శివనామ స్మరణల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చుట్టుప్రక్కల నుంచి వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఇసుకేస్తే రాలనంత భక్త జనంతో రథోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ రథోత్సవ కార్యక్రమానికి వైశ్య సామాజిక వర్గానికి చెందిన గోళ్ళ వంశీయులు ఇమ్మడిశెట్టి వంశీయులు సంయుక్తంగా నిర్వహించారు. నూతనంగా ఏర్పడిన ప్రకాశం జిల్లాలో ప్రసిద్ది చెందిన శ్రీ త్రిపురాంబ సమేత త్రిపురాంతకేశ్వర స్వామి వారి క్షేత్రంలో ఈ తిరుణాల మహోత్సవాన్ని మార్కాపురం జిల్లా అధికారులు జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, ఆర్డిఓ వెంకట శివరామకృష్ణారెడ్డి, త్రిపురాంతం తహసీల్దార్ విజయభాస్కర్, మండలపరిషత్ అభివృద్ధి అధికారి రాజ్ కుమార్, దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి అనిల్ కుమార్, దేవస్థానం పాలక మండలి సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు స్వామివారి రధోత్సవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి కాయకర్పూరాలు సమర్పించారు. మార్కాపురం డిఎస్‌పి నాగరాజు, త్రిపురాంతకం పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి అస్సాన్, ఎస్ఐ శివ బసవరాజు, మరియు 250 మంది పోలీస్ సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా శివరాత్రి మహోత్సవాన్ని దేవస్థానం వారు విజయవంతం చేశారు.

# జేఈఈ మెయిన్స్‌లో బిఆర్ ఆక్స్‌పర్డ్ ఉత్తమ పలితాలు



**కందుకూరు ఫిబ్రవరి 17,ప్రభాతవార్త**

విద్యాశాఖ సోమవారం విడుదల చేసిన జేఈఈ మెయిన్స్-2026 ఫలితాలలో కందుకూరు ఆక్స్‌పరడ్ జూనియర్ కళాశాల విద్యార్థులు జిల్లాలోనే అత్యుత్తమ పలితాలు సాధించినట్లు బి.ఆర్.ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు తెలిపారు. మంగళవారం కళాశాల ఆవరణలో జరిగిన విలేఖర్లతో మాట్లాడుతూ బొల్లినేని కార్తీక్‌నాయుడు జిల్లాలోనే అత్యుత్తమంగా టౌన్‌లో మొదటి స్థానంలో 99.76శాతం పలితాలు సాదించారని తెలిపారు.అదే విధంగా మానికొండ హర్షిత్ చౌదరి 98.96శాతం, యశస్వికుమార్ 96.54శాతం,లోకేష్ 94.52శాతం,అర్యేంద్ర 93.38శాతం, శశికళ 92.88శాతం, నాగ సాయి92.22శాతం,భవ్యశ్రీ 91.94శాతం,లిఖిత సాయి శ్రీ91.69శాతం, బి.రాజేశ్వరి 90.11 శాతం, తరుణ్ 89.88శాతం,వాసవి 89.83శాతం పలితాలు సాధించారని అన్నారు. జేఈఈ అడ్వాన్స్‌కి 30 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు తెలిపారు.సదరు ఆ విద్యార్థిని, విద్యార్థులను, తల్లిదండ్రులను, అధ్యాపక సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్స్ జి.బాల భాస్కరరావు, బి.నరేంద్ర బాబు, ప్రిన్సిపాల్స్ అబ్బూరి వెంకటేశ్వర్లు,షాహుల్ హమీద్, ఇర్ఫాన్,వెంకటరావు,ఇంచార్జి వెంకారెడ్డి,తదితర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## రాళ్లపాడు సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే ఇంటూరి

**- అన్ని సమస్యలు త్వరలోనే పరిష్కారం చేస్తామన్న మంత్రి నిమ్మల**



**కందుకూరు ఫిబ్రవరి 17,ప్రభాతవార్త**

కందుకూరు నియోజకవర్గంలోని రాళ్లపాడు ప్రాజక్టు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలును మంగళవారం కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు శాసనసభలో ప్రస్తావించారు.ఈ ప్రస్తాపన కందుకూరు పరిసర ప్రాంతాల్లో ప్రసార మాద్యమాల్లో హల్‌చల్ చేస్తుంది.శాసనసభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాజక్టు 1.10 టీఎంసీల సామర్థ్యంతో 16వేల ఎకరాలకు సాగునీరు మరియు 116 గ్రామాలకు త్రాగునీరు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే సభకు వివరించారు. కుడి కాలువ ద్వారా 14,500 ఎకరాలకు,ఎడమ కాలువ పరిధిలో 4వేల ఎకరాలకుగానూ 1,500 ఎకరాలకు మాత్రమే సాగునీరు అందిస్తోందన్నారు.ఈ కాలువును విస్తరిస్తే పూర్తిస్థాయిలో నీరందుతుందన్నారు.ప్రస్తుతం రిజర్వాయర్ గేట్లు, హెడ్‌రెగ్యులేటర్లను ఆధునీకరించాలని ఆయన అసెంబ్లీ వేదికగా ఆయన తన గళం వినిపించారు.గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన కృసిని గుర్తుచేశారు.1958లో నిర్మించిన ఈ ప్రాజెక్టుకు తక్షణం చేపట్టాల్సిన పనుల వివరాలను ఎమ్మెల్యే ప్రస్తావించారు.ఇందుకు నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పందిస్తూ రాళ్లపాడు ఎడమ కాలువ పనులుకు రీఎస్టిమేషన్ వేసి పనులను పూర్తి చేస్తామన్నారు.స్టాప్ లాక్ గేట్లు, హైడ్రాలిక్ గేట్లు, ఇతర మెకానికల్ మరమ్మతు పనులను పూర్తి చేసే బాధ్యత తీసుకుంటామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలియజేశారు.1996 వరదల తర్వాత ప్రాజెక్టు మరమ్మతుల్లో ఆధునాతన పరికరాలు,ఆదునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించనందుననీటి విడుదలలో ఒక్కోసారి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఇంటూరి వివరించారు.తాజాగా ఎదురయ్యే సమస్యల పరిష్కారం కష్టంగా ఉంటుంది. మరమ్మతులు చేపడితే రాబోయే ముప్పును ఎదుర్కొవచ్చన్నారు. ఇందుకోసం తక్షణమే నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

**అన్ని సమస్యలు పరిష్కరిస్తా - మంత్రి నిమ్మల రామానాయుడు**

2018లో టీడీపీ ప్రభుత్వం రూ.36.50 కోట్ల పనులు మంజూరు చేసినట్లు తెలిపారు.ఆ తరువాత వైఎస్ఆర్సీపీ అధికారంలోకి వచ్చాక ఈ పనులను రద్దు చేసినట్లు తెలిపారు. ఎడమ కాలువ పనులు త్వరలో పూర్తి చేస్తామన్నారు.రాళ్ళపాడుకు గత 20 నెలల్లో 48 పనులకు రూ.2.54 కోట్లను కూటమి ప్రభుత్వం మంజూరు చేసింది.అలాగే కందుకూరు నియోజకవర్గంలో చెరువులు, కాలువల రిపేర్లు, ఇతర ఆధునీకరణ సహా 140 పనులకోసం రూ.8.32 కోట్ల మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే ప్రాజక్టుకు అవసరమైన అన్ని రకాల మరమ్మతులను పూర్తి చేసే బాధ్యత తీసుకుంటామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలియజేశారు.

# ఈ పంట నమోదు చేయించుకోవాలి -ఏవో దుర్గ



**లింగసముద్రం, ఫిబ్రవరి 17,ప్రభాతవార్త**

ఈ నెల 20వ తేదీలోపు ఈ పంట నమోదు పూర్తిచేసుకోవాలని లింగసముద్రం ఇన్‌చార్జి మండల వ్యవసాయ అధికారి సి హెచ్ వి ఎల్ దుర్గ మంగళవారం రైతులుకు సూచించారు. మండలంలోని తిమ్మారెడ్డిపాలెం, లింగసముద్రం గ్రామాలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ పంట నమోదు మరియు ఈ కేవైసీ విధానాన్ని పరిశీలించారు.రైతులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ రబీ సీజన్లో రైతులపంటసాగు వివరాలను సంబంధిత రైతుసేవా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలన్నారు. అటువంటి రైతులుకే ప్రభుత్వ పదకాలు అమలవుతాయన్నారు.నమోదు ప్రక్రియను వివరించారు. పంటల భీమా ,అన్నదాత సుఖీభవ పొందడానికి అర్హులు అవుతారని తెలిపారు. ఇప్పటికీ మండలం లో 82 ఈ పంట నమోదు పూర్తి అయిందని తెలిపారు. డిజిటల్ అగ్రికల్చర్‌లో భాగంగా రైతులు స్వయంగా అగ్రిస్టాక్ యూనికు ఫార్మర్ ఐడిని జనరేట్ చేసుకోవచ్చాలన్నారు. దీనివల్ల కేంద్ర ప్రభుత్వం నుండి తదుపరి వాయిదాలు పీఎం కిసాన్ పథకంలో భాగంగా లబ్ది పొందడానికి అలాగే ఇతర రాయితీ పథకాలను పొందడానికి ఉపయోగపడుతుందన్నారు.ఇప్పటికే మండలంలో 69మందికి పీఎం కిసాన్ పథకం లబ్ధిదారులుకు ఈ ఐడి నెంబర్ మంజూరుచేసినట్లు దుర్గ వివరించారు. డిజిటల్ వ్యవసాయ యాంత్రికరణపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఇందువలన కలిగే ప్రయోజనాలు వివరించారు.పూర్తి వివరాలకు వ్యవయసాయ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

## ప్రగతి కళాశాలలో రంజాన్ పండుగ సందర్భంగా ఇఫ్తార్ విందు



**కొమరోలు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన కొమరోలులోని ప్రగతి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో రంజాన్ పండుగ సందర్భంగా మంగళవారం ముస్లిం సోదరులకు ముందస్తు ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగతి కళాశాల డైరెక్టర్లు ఎస్.వి రామకృష్ణారెడ్డి, కే సందీప్ రెడ్డిలు పలువురు ముస్లిం సోదరులను ఘనంగా సన్మానించారు. ప్రగతి కళాశాలలో ప్రతి పండుగల సందర్భంగా పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి, విద్యార్థిని విద్యార్థుల్లో సమైక్యతను పెంపొందిస్తున్నారని వక్తలు తెలిపారు. ముస్లిం మత పెద్దలు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఆల్బెండజోల్ మందులు పంపిణీ



**కొమరోలు, ఫిబ్రవరి 17,ప్రభాతవార్త**

జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అంగన్వాడి కేంద్రాల్లో నులిపురుగుల నివారణ మందులను మంగళవారం పంపిణీ చేశారు. అంగన్వాడీ కేంద్రాలలోని 892 విద్యార్థులకుగాను 871మందికి,పాఠశాలల్లో 4313 మంది విద్యార్థులకు గాను 4063 మందికి మొత్తం 4934మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగిలిన వారికి ఈనెల 24వ తేదీన పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ శాంతి, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఏకీకృత కుటుంబ సర్వేపై సమీక్ష



**వేటపాలెం, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి అందించాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఏకీకృత కుటుంబ సర్వే నిర్వహణపై బాపట్ల జిల్లా అధికారి విజయలక్ష్మి మంగళవారం సమీక్షించారు. మండలంలోని కొత్తపేట పంచాయతీ పరిధిలోని స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు 3 సచివాలయాల పరిదిలో సచివాలయాల సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్వేను ఆమె సమీక్షించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే ముగిసిన అనంతరం ప్రతి కుటుంబానికి యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే స్మార్ట్ కార్డులను అందిస్తారన్నారు. ఈ సర్వేలో ప్రతి కుటుంబం అందులోని ప్రతి సభ్యుడి సమాచారాన్ని పక్కాగా సేకరించడం జరుగుతుందన్నారు. తద్వారా సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.రాజేష్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవో జున్ను మరియమ్మ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పంట నమోదు చేయించుకోవాలి



**చీరాల, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

మండలంలోని బుర్లవారిపాలెం, పిట్టువారి పాలెంగ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయాధికారి నిర్మలాదేవి అధ్యక్షత వహించి మాట్లాడారు. 20వ తేదీ లోపు ప్రతి రైతు ఈ రబీ సీజన్లో వేసిన పంటను తమ రైతు సేవ కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకుని వద్ద ఈ పంటలో నమోదు చేయించు కోవాలన్నారు. ప్రభుత్వ పథకాలు పొందడానికి ఈ పంట నమోదు తప్పనిసరి అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ గీత, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పావని,రాణి పాల్గొన్నారు.

# ప్రతి చిన్నారి ఆరోగ్యమే లక్ష్యం

## - కనిగిరిలో క్రిమినాశక దినోత్సవం






**కనిగిరి, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

ప్రతి చిన్నారి ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ క్రిమినాశక దినోత్సవం కార్యక్రమం కనిగిరి పట్టణంలో విజయవంతంగా నిర్వహించబడింది. 1 నుండి 19 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలకు ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. పాఠశాలలు,అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాల ద్వారా ఈ కార్యక్రమాన్ని సమన్వయంతో అమలు చేశారు. ఆరోగ్యశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పిల్లలకు మాత్రలు అందజేసి కడుపులో ఉండే క్రిములను నివారించే చర్యలు చేపట్టారు. క్రిముల వల్ల కలిగే రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలను తగ్గించడమే ఉద్దేశమని తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు షేక్ ఫిరోజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత అధ్యక్షులు అచ్చులా రవి, క్లస్టర్ ఇన్‌చార్జి బుల్లా బాలబాబు, ఒంగోలు పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి షేక్ షరీఫ్, బీసీ సెల్ అధ్యక్షులు పెన్నా వెంకటేశ్వర్లు, నాయకులు చింతలపూడి తిరుపాలు, నీలిశెట్టి అంజినాయుడు, షేక్ నిజాముద్దీన్, నాగ పాతూరు, ముత్యాల నరేష్, తెలుగు మహిళా నాయకురాలు తులసి తదితరులు ఉన్నారు. చిన్నారుల ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం చేపట్టిన ఈ కార్యక్రమం కనిగిరిలో విజయవంతంగా ముగిసింది.

# జేఈఈ మెయిన్స్-2026లో జాతీయ స్థాయిలో

## మెరిసిన బీఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు



**కనిగిరి, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

సోమవారం విడుదలైన జేఈఈ మెయిన్స్-2026 ఫేస్-1 ఫలితాలలో బీఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థలు విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ పర్సెంటైల్‌లు సాధించి ప్రతిభ చాటారు. ఈ విషయాన్ని కళాశాల డైరక్టర్ పగడాల రాంబాబు ఒక ప్రకటనలో వెల్లడించారు. విద్యార్థులు సీహెచ్ రిత్విక్ 96.07 పర్సెంటైల్, షేక్ వదూద్ 95.26 పర్సెంటైల్ సాధించి, స్థాపించబడిన మొదటి బ్యాచ్ నుంచే విశేష ఫలితాలు నమోదు చేసి కళాశాల ప్రతిష్టను జాతీయ స్థాయిలో నిలబెట్టారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు విద్యార్థులను అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో అతి తక్కువ ఖర్చుతో ఐఐటీ, నీట్ విద్య అందించడం తమ విద్యాసంస్థల ప్రధాన లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ ర్యాంకులు సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరక్టర్లు షేక్ షియాజ్, జి.బాల భాస్కర్, బి.నరేంద్ర, బాయ్స్ క్యాంపస్ ప్రిన్సిపాల్ బి.ప్రవీణ్, గర్ల్స్ క్యాంపస్ ఇన్‌చార్జి ఎస్.సామ్రాజ్యం, వైస్ ప్రిన్సిపాల్ బి.రంగనాయకులు, అధ్యాపకులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# గృహప్రవేశ వేడుకకు ఆహ్వానం

## - దద్దాలను కలిసిన సీఎస్ పురం నేతలు



**కనిగిరి, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

సీఎస్‌పురం మండలానికి చెందిన పార్టీ నాయకులు మంగళవారం మధ్యాహ్నం కనిగిరిలోని స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈనెల 19వ తేదీ నిర్వహించనున్న వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్ రెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా ఆయనను ఆహ్వానించారు. ఆహ్వానం స్వీకరించిన దద్దాల నారాయణ యాదవ్ కార్యక్రమానికి శుభాకాంక్షలుతెలియజేశారు. ఈ భేటీలో జడ్పీటీసీ మేకల శ్రీనివాస్, దుగ్గిరెడ్డి జైరెడ్డి, బోర్రాజు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# దత్తనామ సంకీర్తనల మధ్య ఆధ్యాత్మిక ఉత్సాహం

## - రమేష్ నాయనా ఆరాధన



**కనిగిరి, ఫిబ్రవరి17, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణంలోని గార్లపేట రోడ్డులో గల అవధూత శ్రీ రమేష్ నాయనా 10వ ఆరాధన మహోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా నిర్వహించబడింది. ఉదయం వేకువజామునే మహా సమాధి వద్ద ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించి భక్తులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆశ్రమ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో, పుష్పాలంకరణలతో సుందరంగా అలంకరించగా భక్తులను ఆకట్టుకుంది. ధ్యానరత్న, ధ్యాన, జ్ఞాన తంబుర బిరుదాంకితులు డాక్టర్ పిప్పళ్ళ ప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించిన దత్తనామ సంకీర్తన కార్యక్రమం ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని మరింత పెంచింది. భక్తులు నామస్మరణలో మునిగిపోయి కార్యక్రమాన్ని భక్తిపూర్వకంగా నిర్వహించారు. ఈ ఆరాధన మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పట్టణ ప్రముఖులు రమేష్ నాయనా భక్త బృందం అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దత్త ఆశ్రమం నిర్వాహకులు సాగర్ దత్తా ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. కార్యక్రమం భక్తిమయ వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

## జేఈఈ మెయిన్స్ సెషన్ -1 లో మార్కాపురం విద్యార్థి ప్రతిభ



**మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

జేఈఈ మెయిన్స్ సెషన్-1 సోమవారం ప్రకటించిన ఫలితాలలో మార్కాపురం పట్టణానికి చెందిన ఆరిమండ జస్వంత్‌రెడ్డి ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. ఆరిమండ మధుసూదన్ రెడ్డి, వెంకట రమణ దంపతుల కుమారుడైన జస్వంత్ రెడ్డి జేఈఈ మెయిన్స్ ఫస్ట్ సెషన్‌లో 99.48 శాతం మార్కులు సాధించి తన సత్తా చాటుకున్నాడు. ప్రస్తుతం జస్వంత్‌రెడ్డి విజయవాడ నగరంలోని కృష్ణారెడ్డి చైతన్య కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారు. ఈ విశిష్ట ఫలితంపై కళాశాల డైరెక్టర్ ఇబ్రహీం, యాజమాన్యం, అధ్యాపకులు మరియు అధ్యాపకేతర సిబ్బంది జస్వంత్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. జిల్లాకు గర్వకారణంగా నిలిచిన జస్వంత్ రెడ్డికి పలువురు ప్రముఖులు, స్నేహితులు శుభాకాంక్షలు తెలిపారు.

## సంతమాగులూరులో జాతీయ నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ




**సంతమాగులూరు, ఫిబ్రవరి 17,ప్రభాతవార్త**

మండల కేంద్రమైన సంతమగులూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమాన్ని మంగళవారం విస్తృతంగా నిర్వహించారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణను లక్ష్యంగా తీసుకుని మండల వ్యాప్తంగా ఈ కార్యక్రమం కొనసాగింది. వైద్యులు డాక్టర్ నిర్మల్ కుమార్, డాక్టర్ జ్యోత్స్న పర్యవేక్షణలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు మరియు అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న పిల్లలకు అల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమ నిర్వహణలో పర్యవేక్షకులు ప్రసన్నకుమారి, భూపాల్‌రెడ్డి, రామకోటేశ్వరమ్మ,రవి సమన్వయంతో పనిచేశారు. ఆరోగ్యసిబ్బంది, ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది కలిసి పిల్లలకు మాత్రలు అందజేశారు. మండలంలో ఒకటి నుండి 19 సంవత్సరాలలోపు వయస్సు గల 9,032 మంది పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. ఇంకా ఏదేని కారణాల వల్ల మాత్రలు తీసుకోలేని పిల్లలకు ఈ నెల 24వ తేదీన ప్రత్యేకంగా మాత్రలు వేయడం జరుగుతుందని ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ నిర్మల్ కుమార్ తెలిపారు. నులిపురుగుల వల్ల రక్తహీనత, బలహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలు తలెత్తుతాయని, అందువల్ల ప్రతి చిన్నారి తప్పనిసరిగా మాత్రలు తీసుకోవాలని వైద్యులు సూచించారు. మాత్రలు తీసుకున్న తర్వాత స్వల్ప అసౌకర్యం కలిగినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.ఈ కార్యక్రమం ఆరోగ్య శాఖ సమన్వయంతో విజయవంతంగా నిర్వహించబడిందన్నారు.ఈ కార్యక్రమంలో మండలంలోని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు తదితరులు వున్నారు.

# సింగరకొండలో స్వామి వారికి ఘనంగా పూజలు





**అద్దంకి , ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

అద్దంకి మండలం సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవస్థానంలో మంగళవారం మాఘ బహుళ అమావాస్య ధనిష్ట నక్షత్రం స్వామివారికి ప్రీతికరమైన రోజు,ఆలయంలో స్వామివారికి కదలి ఫలార్చన పూజా కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఒంగోలు వాస్తవ్యులు బంధకవి ప్రవీణ్ ధర్మపత్ని మధుమాలతి దాతలుగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతకాల సుప్రభాతం, గోపూజ, బిందెతీర్థం ,అనంతరం స్వామి వారికి అభిషేక కార్యక్రమం అలంకరణ తదుపరి వేద పండితులు అర్చకులు ఉభయ దాతలు వేద స్వస్తి మంగళ వాయిద్యాలతో ఆలయ ప్రదక్షణ వినాయక స్వామి వారికి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి జీవద్వజ ఉష్ణ వాహనానికి నారికేల ఫల సమర్పణ జరిగినాయి. అనంతరం గణపతి పూజ 11 ఆవృతాలుగా దేవస్థానం వేద పండితులు అర్చకులు దహస్తరణ పూజా కార్యక్రమం నిర్వహించినారు .అనంతరం స్వామివారికి మహా నివేదన పంచహారతులు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాలక మండల అధ్యక్షులు చుండూరు మురళీ సుధాకర్ రావు దంపతులు అసిస్టెంట్ కమిషనర్ మదమంచి తిమ్మనాయుడు, సభ్యులు మద్ద సునీత ఆంజనేయులు ,ఏల్చూరి గోపికృష్ణ వెంకటనారాయణమ్మ,తదితరులు పాల్గొన్నారు. స్వామివారికి సంతృప్తుడై ఏ మానవుడైతే అరటిపండుతో పూజ చేశారో వారు సంపూర్ణ ఆరోగ్యవంతులు అవుతారని ఆంజనేయ సహస్రనామంలో కూడా కదిలీపనసం అనే నామములతో ప్రతినిత్యం స్వామి వారి అర్చన లో ఉచ్చరిస్తూ ఉంటారు. స్వామివారి అలంకరణలో వడమాల వేయడం కూడా ఒక ప్రత్యేక విశేషము. అర్చకులు వేదపండితులు దాతలకు కృపకటాక్ష వీక్షణను పొందాలని ఆ భగవంతున్ని ఆశీర్వదించినారు.

# సింగరకొండ దర్శించిన రఘుబాబు



**అద్దంకి, ఫిబ్రవరి 17,ప్రభాతవార్త**

సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ దేవస్థానమునకు స్వామి దర్శనార్థం రావినూతల గ్రామ వాస్తవ్యులు సినిమా యాక్టర్ గిరిబాబు కుమారుడు రఘుబాబు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదములను అర్చకులు ద్వారా ఆశీర్వచనం అందుకున్నారు. రఘుబాబుకు స్వామివారి పట్టు వస్త్రము, చిత్రపటం అర్చకుల నుండి అశ్శీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలక మండల అధ్యక్షులు చుండూరి మురళీ సుధాకర్‌రావు, సభ్యులు ఏల్చూరి వెంకట నారాయణమ్మ, గోపికృష్ణ, మద్దా సునీత ఆంజనేయులు, బిజెపి సీనియర్ నాయకులు తమ్మనశ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు సింగరకొండ 71వ వార్షిక తిరునాళ్ళ సన్నాహక సమావేశం

### - ఆర్‌డిఒ అధ్యక్షతన నిర్వాహణ - పాల్గొననున్న అన్నీశాఖల అధికారులు

**అద్దంకి , ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి, శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వార్ల 71వ వార్షిక తిరునాళ్ళ మార్చి 2వ తేది జరగనున్నది. ఈ ప్రధాన ఉత్సవాన్ని పురస్కరించుకుని అన్నీ శాఖల అధికారులతో తిరునాళ్ళ నిర్వహణ సన్నాహక సమావేశం బుధవారం ఉదయం 10.30గంటలకు సింగరకొండలో అద్దంకి ఆర్‌డిఒ ప్రసన్న లక్ష్మీ అధ్యక్షత జరగనున్నది. ఈ సమావేశానికి ఆలయపాలకమండలి అధ్యక్షులు చుండూరి మురళీ సుధాకరరావు, పాలకమండలి సభ్యులు, ఆలయ ఈఒ ఎం.తిమ్మననాయుడుతోపాటు స్థానిక తహశీల్దార్ శ్రీచరణ్‌తోపాటు, పోలీస్, ఆర్‌టిసి, మెడికల్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఫైర్, మండల పరిషత్ అధికారి, ట్రాన్స్‌కో అధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొనున్నారు.

# వృద్ధుడి ఇంటిపై అక్రమ దందా

## - న్యాయం కోసం జాయింట్ కలెక్టర్‌ను ఆశ్రయించిన యేసయ్య



**మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

మార్కాపురం జిల్లా కేంద్రంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో హనుమంతునిపాడు మండలం హనుమంత పురం గ్రామానికి చెందిన 73 ఏళ్ల వృద్ధుడు తలారి యేసయ్య మంగళవారం జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యేసయ్య మాట్లాడుతూ అనారోగ్యంతో మతిస్థిమితం సరిగా లేని సమయంలో తన బంధువులు తన వేలిముద్రలు తీసుకుని ఇంటి పత్రాలను అక్రమంగా మార్చుకున్నారని ఆరోపించారు. అనంతరం ఆ ఇంటిని వేరే వ్యక్తులకు విక్రయించడంతో వారు తన ఇంటికి వచ్చి బెదిరింపులకు పాల్పడుతూ, ఇంటిని ఖాళీ చేయాలని ఒత్తిడి తెచ్చి, ఇంట్లోని సామాను రోడ్డుపై పడేశారని వాపోయారు. తనకు ఆశ్రయం ఇచ్చే ఏకైక ఇల్లు కూడా దూరమైపోయిందని,బంధువుల అత్యాశ వల్ల అన్యాయం జరిగిందని ఆయన కన్నీటి పర్యంతమయ్యారు. సంబంధిత అధికారులు తక్షణం విచారణ జరిపి తన ఇంటిని ఇతరుల చెర నుంచి విడిపించి న్యాయం చేయాలని వృద్ధుడు వేడుకున్నారు.

## సిందరకొండ దేవస్థానానికి మైక్ సెట్ బహుకరణ



**అద్దంకి , ఫిబ్రవరి 17,ప్రభాతవార్త**

అద్దంకి మండలం సింగరకొండ శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో మంగళవారం దేవస్థానానికి అద్దంకికి చెందిన మానికొండ నాగరాజు దంపతులు దేవస్థానంలో అవసరమైన మైకు ,యాంపిల్ ఫైర్,స్పీకర్లు,మాట్లాడుకోవడానికి మౌతులు ,వీటికి కావలసిన వైరు చుట్టాలు దేవస్థానానికి అందజేసినారు.వీటి విలువ 65 వేల వరకు వుంటుంది.ఈ వస్తువులను పాలక మండల అధ్యక్షుడు చుండూరు మురళీ సుధాకర్ రావు, సభ్యులు ఏల్చూరి వెంకట నారాయణమ్మ గోపికృష్ణ, మద్దా సునీత ఆంజనేయులు,12వ వార్డు కౌన్సిలర్ అత్తులూరి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. దాతలకు అర్చకులు పట్టు వస్త్రములు, ఆశీర్వచనం, స్వామి వారి తీర్థ ప్రసాదములు అందజేశారు.

## కూటమి ప్రభుత్వం ఆక్వా రైతులకు అండగా నిలుస్తోంది

### - ఆక్వా రైతులకు యూనిట్‌కు రూ. 1.50 కే సరఫరా

### - విద్యుత్‌యూనిట్ కు రూ.2.35ను సబ్సిడీని కూటమి ప్రభుత్వం భరిస్తోంది

### - విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



**అద్దంకి , ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం ఆక్వా రైతులకు ఎల్లవేళలా అండగా నిలుస్తోందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ఆక్వా రైతులకు ఒకే రకమైన విద్యుత్ సబ్సిడీ అమలుపై అసెంబ్లీలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అడిగిన ప్రశ్నకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమగ్ర సమాధానం ఇచ్చారు.మంత్రి వెల్లడించిన వివరాల ప్రకారం ఆక్వాకల్చర్‌కు విద్యుత్ సబ్సిడీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి వెల్లడించారు. ఆక్వాకు సంబంధించి జోన్, నాన్ జోన్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను ఫిషరీస్ శాఖ సమగ్రంగా నిర్వహించిందని స్పష్టం చేశారు. ఇందులో ఎలాంటి లోపాలు లేవని స్పష్టం చేశారు. ఏపీఈఆర్సీ ఆదేశాల ప్రకారం ఆక్వాకల్చర్‌కు యూనిట్‌కు రూ. 3.85 వసూలు చేయాల్సి ఉన్నప్పటికీ ఆక్వా రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం రూ. 2.35 సబ్సిడీ భారం భరిస్తూ యూనిట్‌ను కేవలం రూ. 1.50 కే అందిస్తున్నదని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వంలో నోటిఫైడ్ ఆక్వాకల్చర్ జోన్ పేరుతో కేవలం పది ఎకరాలకే పరిమితం చేశారని మంత్రి గొట్టిపాటి అసెంబ్లీ వేదికగా సభ్యులకు వివరించారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఆ పరిమితులను సవరించి రైతులకు అనుకూల నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. గతంతో పోలిస్తే 50 వేల అదనపు ఆక్వాకల్చర్ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 5 లక్షల 21 వేల మంది ఆక్వా రైతులు యూనిట్‌కు రూ. 1.50 చెల్లిస్తూ సబ్సిడీ ప్రయోజనం పొందుతున్నారని మంత్రి తెలిపారు. ఆక్వా రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

## ఛలో విజయవాడ తరలిన యుటిఎఫ్ సంఘ ఉపాధ్యాయులు




**అద్దంకి , ఫిబ్రవరి 17,ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యుటిఎఫ్ రాష్ట్రశాఖ పిలుపుమేరకు 12వ పిఆర్సి కమిషన్ నియమించాలని, పెండింగ్ డిఎల్ విడుదల చేయాలని, ఐఆర్ 29శాతం ప్రకటన చేయాలని,హెల్త్ కార్డుల సమస్యలను పరిష్కరించాలని, ప్రధానమైన డిమాండ్లతో చలో విజయవాడ పిలుపునివ్వడం జరిగింది. ఈ మేరకు అద్దంకి డివిజన్ పరిధిలోని 50 మంది ఉపాధ్యాయులు చలో విజయవాడ కార్యక్రమానికి మంగళవారం ఉదయం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాబురావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఉద్యోగ ఉపాధ్యాయులకు ఎటువంటి కేటాయింపులు లేకపోవడం శోచనీయమన్నారు. మండల అధ్యక్షులు బి.వి రత్నం మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పనిసరిగా అమలు చేయాలని, ఉపాధ్యాయులపై ఉన్న ఒత్తిడిని తగ్గించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి బి.పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఉద్యోగులకు న్యాయబద్ధంగా రావలసిన ఆర్థిక ప్రయోజనాలను ప్రభుత్వం కేటాయింపులు చేయకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గోగుల కోటేశ్వరరావు, బి.చంద్రశేఖర్, రవిచంద్ర, రామాంజనేయులు, బాచిన పూర్ణచంద్రరావు, రాజశేఖర్,బి శ్రీనివాస్, ప్రసాద్, సోమేపల్లి హనుమంతరావు, కందుల గంగాధర్, ఇట్టా రామారావు,బ్రాహ్మజీ, పురుషోత్తం, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి - ఎఒ



**అద్దంకి , ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి అని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. మండలం లోని వెంపరాల, చక్రాయపాలెం గ్రామాలలో పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ఇంకా 1800 మంది గుర్తింపు సంఖ్య పొందాల్సి ఉంది అని తెలిపారు.ఈ సంఖ్య లేకపోతే ప్రభుత్వ పథకాలు వర్తించవని తెలిపారు.ఈ పంట నమోదు ఈ నెల 20 వ తేదీ లోపు చేయించుకోవాలని తెలిపారు మొక్కజొన్న, శనగ, వరి సాగు చేసిన రైతులు ప్రభుత్వ మద్దతు ధర పొందాలంటే ఈ పంట నమోదు చేసుకోవాలని సూచించారు. త్వరలోనే శనగ కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తారని, రైతులు తక్కువ ధరకు అమ్మవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రసన్న, శివాని, వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శేషారావు తదితరులు పాల్గొన్నారు.

# రావణబ్రహ్మపై ముక్కంటి దర్శనం

## - ప్రణమిల్లిన భక్తకోటి జనం





**ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి17, ప్రభాతవార్త**

శివరాత్రి మహా పండగ పర్వదినం పురస్కరించుకొని ప్రకాశం జిల్లాలో కొత్తపట్నం మండలం మడనూరు గ్రామంలో శివపార్వతుల పరిణయ మహోత్సవం జరిగిన మరుసటి రోజు ఆది దంపతులు శివపార్వతుల ఊరేగింపు గ్రామంలోని వీధుల గుండా గ్రామోత్సవాన్ని శోభాయ మానంగా నిర్వహించారు. రావణబ్రహ్మపై ఆదిదంపతులు పార్వతీ పరమేశ్వరలకు భక్తులు పసుపు కుంకుమ సారే సమర్పించి నివేదనతో మొక్కులు తీర్చుకొని స్వామి అమ్మవార్ల మంగళ హారతులు ఇచ్చి ఆది దంపతులు ప్రణమిల్లి భక్తి భావంతో పరవశించారు .

# తౌషిక్ మృతి కేసు విచారణ వేగవంతం చేస్తాం

## - విచారణాధికారిగా అన్వర్ భాష

## - న్యాయం చేయాలి - పోలీస్ స్టేషన్ ఎదుట రహదారిపై నిరసన



**సింగరాయకొండ,ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

మండలంలోని మూలగుంటపాడు గ్రామంలో ఉన్న శ్రీ చైతన్య నవోదయ కోచింగ్ సెంటర్‌లో ఆరో తరగతి చదువుతున్న కనిగిరికి చెందిన తౌషిక్ అనుమానస్పద మృతి కేసులో నాలుగు రోజులు గడిచినా ఎటువంటి పురోగతి కనిపించకపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.మృతుడు తౌషిక్ తల్లిదండ్రులు మోలాభి,అలి మరియు బంధువులు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట రహదారి పై బైఠాయించి నిరసన తెలిపారు.తౌషిక్ మృతికి కారణమైన కరస్పాండెంట్ రమణ రెడ్డి, చైతన్య, వార్డెన్ బాబ్జీలు దర్జాగా బయట తిరుగుతున్నారని, వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించి,తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.ఇంత వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తూ కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.సమాచారం అందుకున్న సీఐ సి.హెచ్. హజరత్తయ్యా ఘటనాస్థలికి చేరుకుని పోలీస్ స్టేషన్ కి పిలిపించి బాధితులతో మాట్లాడారు జిల్లా ఉన్నతా ధికారులు కేసు విచారణను కందుకూరు సీఐ అన్వర్ బాషాకు అప్పగించారని తెలిపారు.దర్యాప్తు జరుగుతున్న సమయంలో యాజమాన్యంపై తక్షణ చర్యలు తీసుకోవడం సాధ్యం కాదని, దర్యాప్తు పూర్తైన వెంటనే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**విద్యార్థి అనుమానాస్పద కేసు విచారణాధికారిగా సిఐ అన్వర్ భాష :**





ఈ సందర్భంగా కందుకూరు సీఐ అన్వర్ బాషా సింగరాయకొండసర్కిల్ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన శ్రీ చైతన్య నవోదయ కోచింగ్ సెంటర్‌లో ఆరో తరగతి చదువుతున్న సయ్యద్ తౌషిక్ మృతి చెందినట్లు తెలిపారు.ఈ ఘటనపై 17/26 అనుమానాస్పద కేసుగా నమోదు చేసినట్లు వెల్లడించారు.మృతుడి తల్లిదండ్రులతో కేసు సంబంధించిన అనుమానాలు, సందేహాలు గురించి చర్చించినట్లు తెలిపారు.ఈ కేసు దర్యాప్తును ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాలు మేరకు మంగళవారం విచారణ అధికారిగా నియమించారని, ఈ కేసును లోతుగా దర్యాప్తు చేసి త్వరతగతిన బాధితులకు న్యాయం చేస్తామని స్పష్టం చేశారు.విచారణలో భాగంగా ఏదైనా కీలక సమాచారం బయటపడితే వివరాలు వెల్లడిస్తామని సీఐ తెలిపారు.విచారణ అనంతరం బాధితులు మాట్లాడుతూ గత రాత్రి ఎస్పీ హర్షవర్ధన్ రాజును కలిసి మా బిడ్డ మృతి కేసుకు సంబంధించి దర్యాప్తును మరొక సీఐకు మార్చమని అడగడం జరిగిందని, ఏస్పీ ఆదేశాల మేరకు కందుకూరు సీఐ అన్వర్ భాషను విచారణ అధికారిగా నియమించడం జరిగిందన్నారు.సీఐ లోతుగా విచారణ చేసి త్వరగా కేసు పూర్తిచేసి మృతికి సంబందించిన కారకులను కఠినంగా శిక్షించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. విచారణ అధికారి హామీ మేరకు ఆందోళన విరమిస్తున్నట్లు బాధితులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

# వైకాపా కార్యకర్తను పరామర్శించిన బూచేపల్లి



**కురిచేడు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

మండలంలో అనారోగ్యంతో బాధ పడుతున్న వైకాపా కార్యకర్తను పరామర్శించడానికి మంగళవారం నాడు దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కురిచేడు వచ్చారు.మండలంలో గల కాటంవారిపల్లి గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త కాటం పెద్దిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అతనిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట మండల వైకాపా కన్వీనర్ సుబ్బయ్య, జడ్పీటీసీ నుసుం నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ కోటిరెడ్డి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

